విశాల భారతి
తెలుగు దిన పత్రిక
ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలో పనిచేయుటకు అనుభవం ఆసక్తి ఉన్న జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు,మండల విలేకరులు కావలెను.
కొత్తవారికికూడా అవకాశం కలదు..
పనిచేయు మండలాలు:
ఖమ్మం జిల్లా : జిల్లా స్టాఫర్, క్రైమ్,ఖమ్మం రూరల్,మండలాలు తిరుమలయపాలెం ,వైరా, కొణిజర్ల, ముదిగొండ, రఘునాథపాలెం, ఎర్రుపాలెం,మధిర, తల్లాడ, బోనకల్లు, చింతకాని, కామేపల్లి, కల్లూరు పెనుబల్లి, వేంసూరు,ఏన్కూరు మండల విలేకర్లు కావలెను.
కొత్తగూడెం జిల్లాలో: కొత్తగూడెం,కొత్తగూడెం టౌన్, సింగరేణి, క్రైమ్, జూలూరుపాడు, సుజాత నగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి,టేకులపల్లి,ఇల్లందు చంద్రుగొండ,అన్నపూరెడ్డిపల్లి, ములకలపల్లి, దుమ్మగూడెం, చర్ల, పినపాక.
పైన తెలిపిన మండలాల్లో నిజాన్ని నిర్భయంగా రాసే దమ్మున్న ఆసక్తి గల విలేకర్లు కావలెను.
సంప్రదించవలసిన నెంబర్:
93989 08071
వివరాల కోసం: epaper.vishalabharati.com

14-03-2026

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 69

# 7 వేల కోట్లతో గాంధీ సరోవర్

## మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు



- తొలి దశలో 21 కిలోమీటర్ల సుందరీకరణకు రూ.7,000 కోట్లు
- 55 కి.మీ మేర 5 జోన్లుగా విభజించి సమగ్ర అభివృద్ధి
- ఏడాది పొడవునా పారేలా 2.5 టీఎంసీల గోదావరి జలాలు
- మాస్టర్ ప్లాన్ సిద్ధం.. 36 నెలల్లో మొదటి దశ పూర్తి
- 9 కొత్త వంతెనలు, 3 బ్యారేజీలతో పర్యాటక హబ్‌గా మార్పు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

భాగ్యనగరం అంటే కేవలం కాంక్రీట్ జంగిల్ కాదు, అది కోట్లాది మంది కలల నిలయం. రాబోయే రోజుల్లో రెండు కోట్ల జనాభాకు చేరుకోనున్న ఈ మహానగరాన్ని భావి తరాలకు భద్రంగా అందించాలంటే మూసీ నది ప్రక్షాళన ఒక్కటే ఏకైక మార్గమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టిగా విశ్వసిస్తున్నారు. నగరానికి ప్రాణవాయువులాంటి మూసీని మురికి కూపం నుంచి విముక్తి చేసి, దాని పూర్వ వైభవాన్ని తీసుకురావడమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇది కేవలం ఒక నది శుద్ధి కార్యక్రమం మాత్రమే కాదు, హైదరాబాద్ ఆర్థిక, పర్యావరణ, సాంస్కృతిక ముఖచిత్రాన్ని మార్చే ఒక బృహత్తర యజ్ఞం. గత రెండేళ్లుగా నిపుణులతో జరిపిన మేధోమథనం, అంతర్జాతీయ స్థాయిలో జరిగిన అధ్యయనాల ఫలితంగానే ఈ బృహత్తర 'రివర్ ఫ్రంట్' ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా నిలబెట్టాలంటే సహజ వనరుల పునరుద్ధరణ తప్పనిసరని భావిస్తున్న సర్కారు, ఇందుకోసం

మిగతా 3లో..

# గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్ పంజా

**దుబాయ్ ఐఎఫ్సీపై ఇరాన్ భీకర డ్రోన్ దాడి**

- అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో రగిలిపోతున్న టెహ్రాన్
- అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా క్షిపణి వర్షం
- గల్ఫ్ ప్రాంతంలో ఆగిపోయిన విమాన రాకపోకలు
- ముదిరిన యుద్ధం.. అంతర్జాతీయ మార్కెట్లో చమురు సెగ
- మూడో ప్రపంచ యుద్ధం ముంగిట పశ్చిమాసియా?

02



# టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు



05

- టెహ్రాన్ స్క్వేర్‌లో నిరసనలు జరుగుతుండగా భారీ పేలుడు
- ఖజ్వీన్ నగరంలోనూ దాడులు.. వణికిపోతున్న ఇరాన్
- ఇరాన్ నౌకాదళం, వైమానిక దళం ఖతం: డొనాల్డ్ ట్రంప్
- 47 ఏళ్ల అరాచకానికి ముగింపు పలుకుతామన్న అమెరికా
- ఇరాక్‌లో అమెరికా యుద్ధ విమానం కూలి ఆరుగురు సైనికులు మృతి
- త్వరలోనే ఇరాన్ లొంగిపోనుందన్న జీ7 దేశాల అంచనా

# ఆర్టీసీ సమ్మె సైరన్

- విలీనం డిమాండ్‌తో ఈడీకి సమ్మె నోటీసు అందజేత
- 14 రోజుల గడువు.. స్పందించకుంటే సమ్మె ఖాయం
- 30శాతం ఫిట్‌మెంట్‌తో 2021 వేతన సవరణ అమలు
- రూ.2,500 కోట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- షరతులు లేకుండా నెలకు రూ.350 కోట్లు కేటాయించాలి

04

గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని నేతల డిమాండ్





# త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది

- త్వరలోనే ఇరాన్ లొంగిపోతుందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇరాన్ నౌకా, వైమానిక దళాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని వెల్లడి
- ఇరాక్ సమీపంలో అమెరికా రీఫ్యూయలింగ్ విమానం కూలి నలుగురు మృతి
- టెహ్రాన్‌లోని అణు కేంద్రాలు, కీలక స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు

02




# ఎన్నికల బాస్‌పై యుద్ధం

- ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై తొలిసారి అభిశంసన నోటీసు
- జ్ఞానేష్ కుమార్‌పై ఏడు రకాల తీవ్ర ఆరోపణలు
- లోక్‌సభలో 130, రాజ్యసభలో 63 మంది ఎంపీల సంతకాల
- ఇండియా కూటమితో పాటు ఆప్, స్వతంత్రుల మద్దతు
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి తరహాలోనే తొలగింపు ప్రక్రియ
- నేరం రుజువైతే పింఛన్, ఇతర ప్రయోజనాలపై వేటు

02



03

# పేదల గూడు చెదరనీయం

- మూసీ ప్రక్షాళనను స్వాగతిస్తున్నాం
- పేదల ఇళ్ల కూల్చివేతను సహించం
- ముందుగా పునరావాసం కల్పించాలి
- సబర్మతి నది నమూనాను అనుసరించండి
- రిలైన్‌మెంట్ ద్వారా ఇళ్లను కాపాడాలి
- గాంధీ సరోవర్ పేరుతో అరాచకం వద్దు



# అన్నదాతకు మోదీ భరోసా

**విశాలభారతి, జాతీయం:**

అస్సాంలోని గువాహటి వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి తనదైన శైలిలో అభివృద్ధి మంత్రాన్ని పఠిస్తూనే విపక్షాలపై రాజకీయ బాణాలను సంధించారు. దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 9.3 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూర్చేలా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 22వ విడత నిధులను ఆయన అక్కడి నుంచే బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లోకి విడుదల చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎన్డీయే ప్రభుత్వం, క్లిష్ట పరిస్థితుల్లోనూ అన్నదాతను ఆదుకుంటోందని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశాన్ని అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం బాధ్యతారాహిత్యంగా

మిగతా 2లో..

- 9.3 కోట్ల మంది రైతులకు రూ. 20,000 కోట్ల పీఎం కిసాన్ నిధులు విడుదల
- టీ తోట కార్మికులకు భూమి పట్టాల పంపిణీ.. చారిత్రక అన్యాయానికి ముగింపు
- సంక్షోభ సమయాల్లోనూ హస్తం పార్టీ అసత్య ప్రచారాలే చేస్తోందని ధ్వజం
- అంతర్జాతీయంగా ధరలు పెరిగినా రూ. 12 లక్షల కోట్ల ఎరువుల సబ్సిడీ భారం భరించిన కేంద్రం
- అస్సాం అభివృద్ధిని చూసి బెంగాల్ ప్రజలు కూడా బీజేపీ పాలన కోరుకుంటున్నారు
- విదేశీ దిగుమతులపై ఆధారపడకుండా దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపిస్తున్న ఎన్డీయే

# అవినీతి అనకొండ రేవంత్ రెడ్డి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు
- కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ సీఎందేనని ఆరోపించారు
- దివాలా తీసిన సంస్థకు వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చారని విమర్శించారు
- కోర్టులో సాక్ష్యాలను ప్రభుత్వం మాయం చేసిందని ఆరోపించారు
- రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని మండిపడ్డారు
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సమగ్ర వివరాలతో లేఖ రాశారు

03



# త్వరలోనే ఇరాన్ లొంగిపోతుంది

- త్వరలోనే ఇరాన్ లొంగిపోతుందన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇరాన్ నౌకా, వైమానిక దళాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని వెల్లడి
- ఇరాక్ సమీపంలో అమెరికా రీఫ్యూయలింగ్ విమానం కూలి నలుగురు మృతి
- టెహ్రాన్‌లోని అణు కేంద్రాలు, కీలక స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు
- లెబనాన్‌పై విరుచుకుపడుతున్న ఐడీఎఫ్; ముస్లిం బ్రదర్‌హుడ్ నేత లక్ష్యంగా దాడి
- ఇజ్రాయెల్, అమెరికా నౌకాదళంపై 44వ విడత క్షిపణి దాడులు చేసిన ఇరాన్

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడమే కాదు, ఇప్పుడు అవి నిప్పుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. గత రెండు వారాలుగా ఇరాన్, ఇజ్రాయెల్ , అమెరికా మధ్య కొనసాగుతున్న పోరు పతాక స్థాయికి చేరుకుంది. ఈ ఉద్రిక్తతల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ పాలక యంత్రాంగం పతనం అంచున ఉందని, ఆ దేశం త్వరలోనే లొంగిపోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. జీ7 దేశాల నేతలతో జరిగిన వర్చువల్ భేటీలో ట్రంప్ ఈ విషయాన్ని స్పష్టం చేసినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు వెల్లడించాయి. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ సవాళ్లకు ప్రతిసవాలుగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఇరాన్ పాలకులపై ట్రంప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ నేతలు అమాయక ప్రజల రక్తాన్ని చిందిస్తున్నారని, అటువంటి ఉన్మాదుల పాలనకు అంతం పలకడం తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే నామరూపాల్లేకుండా పోయిందని, వారి వైమానిక దళం కూడా దాదాపు కనుమరుగైందని ట్రంప్ వివరించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల ధాటికి ఇరాన్ రక్షణ వ్యవస్థలు కకావికలం అయ్యాయని, వారి క్షిపణులు, డ్రోన్లు గాల్లోనే పేలిపోతున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. భూమిపై నుంచి ఇరాన్ ఉగ్రవాద మూలాలను తుడిచిపెట్టే వరకు విశ్రమించేది లేదని ఆయన హెచ్చరించారు. మరోవైపు యుద్ధ భూమిలో విషాదకర ఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. శుక్రవారం పశ్చిమ ఇరాక్ ఆకాశంలో అమెరికాకు చెందిన కేసీ135 రీఫ్యూయలింగ్ విమానం ప్రమాదానికి గురైంది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో భాగంగా గగనతలంలో ఇంధనాన్ని నింపే ప్రక్రియలో ఉండగా ఈ ప్రమాదం జరిగినట్లు అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ ధృవీకరించింది. ఈ ఘటనలో విమానంలో ఉన్న ఆరుగురు సిబ్బందిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా, ఇద్దరి పరిస్థితిపై స్పష్టత లేదు. అయితే, ఈ విమానాన్ని ఇరాక్ రెసిస్టెన్స్ గ్రూపులే కూల్చివేసినట్లు ఇరాన్ ప్రచారం చేసుకుంటోంది. ఇదే సమయంలో మరో విమానం సగం ధ్వంసమైనా పైలట్ చాకచక్యంగా ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో సురక్షితంగా ల్యాండ్ చేయడం గమనార్హం.



ఇరాన్ రాజధాని టెహ్రాన్ ఇప్పుడు అగ్నిగుండంగా మారింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ గత 24 గంటల్లో ఏకంగా 200కు పైగా లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి. అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్‌లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్న తరుణంలోనే భారీ పేలుడు సంభవించి పెను కలకలం సృష్టించింది. ఈ దాడుల్లో ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలు, క్షిపణి తయారీ కేంద్రాలు లక్ష్యంగా మారాయి. పదుల సంఖ్యలో ఫైటర్ జెట్లు టెహ్రాన్ గగనతలంలో గర్జిస్తూ బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ యుద్ధం చేసే సామర్థ్యాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఇజ్రాయెల్ రక్షణ శాఖ స్పష్టం చేసింది.

ముఖ్యంగా ఇరాన్ గర్వకారణంగా భావించే అణు సంబంధిత కేంద్రాలపై కూడా దాడులు జరిగినట్లు సమాచారం అందుతోంది. టెహ్రాన్ పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పేలుడు శబ్దాలు వినిపించాయని అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడిస్తున్నారు. ఇరాన్ తన రక్షణ కవచం అనుకున్న వ్యవస్థలన్నీ ఇజ్రాయెల్ దాడుల ముందు తలవంచినట్లు కనిపిస్తోంది. టెహ్రాన్ నగరం దట్టమైన పొగతో నిండిపోవడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ దాడులు ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై, సైనిక పటిష్టతపై కోలుకోలేని దెబ్బ తీస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

లెబనాన్ సరిహద్దుల్లో కూడా యుద్ధ సెగలు తీవ్రంగా ఉన్నాయి. హెజ్‌బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులను మరింత ఉధృతం చేసింది. బీరుట్‌లో జరిగిన క్షిపణి దాడిలో ఒక అపార్ట్‌మెంట్ భవనం పూర్తిగా ధ్వంసమై మంటల్లో చిక్కుకుంది. ఈ దాడిలో ఒకరు మరణించగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ముఖ్యంగా ముస్లిం బ్రదర్‌హుడ్ విభాగానికి చెందిన ఒక కీలక అధికారిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ ఈ దాడి చేపట్టింది. ఈ ఘటనలో సదరు అధికారి గాయపడగా, ఆయన ఇద్దరు కుమారులు ప్రాణాలు కోల్పోయారు. హెజ్‌బొల్లా ఉగ్రవాదులు సామాన్య ప్రజల నివాసాల్లో తలదాచుకుంటున్నారని, అందుకే ఇలాంటి దాడులు తప్పడం లేదని ఇజ్రాయెల్ పేర్కొంది.

ఇరాన్ ప్రతిఘటన కూడా తక్కువ ఏమీ లేదు. ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ రంగంలోకి దిగి అమెరికా, ఇజ్రాయెల్ బలగాలపై 44వ విడత భారీ క్షిపణి దాడులను చేపట్టింది. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంలోని కిర్యత్ ష్మోనా, హడెరా, కీలకమైన హైఫా నగరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో అధునాతన లాంగ్ రేంజ్ క్షిపణులను ఇరాన్ వినియోగించినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ తన 'ఐరన్ డోమ్' 'డేవిడ్స్ స్లింగ్' వంటి వాయు రక్షణ వ్యవస్థలను యాక్టివేట్ చేసి అనేక క్షిపణులను గాల్లోనే అడ్డుకున్నప్పటికీ, యుద్ధ వాతావరణం మాత్రం చల్లారడం లేదు.

గల్ఫ్ రీజియన్‌లోని అమెరికా సైనిక స్థావరాలు కూడా ఇరాన్ లక్ష్యంగా మారాయి. బహ్రెయిన్ కేంద్రంగా పనిచేస్తున్న అమెరికా ఐదో నౌకాదళంపై ఇరాన్ క్షిపణి దాడులకు ప్రయత్నించడం ఉద్రిక్తతలను మరో స్థాయికి తీసుకెళ్లింది. అమెరికా తన ఆస్తులను, సైనికులను రక్షించుకోవడానికి మధ్యప్రాచ్యానికి అదనపు బలగాలను, యుద్ధ విమానాలను తరలిస్తోంది. ఇరాన్ దూకుడును అడ్డుకోవడానికి అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. ఇరు పక్షాల మధ్య ఈ క్షిపణి యుద్ధం పశ్చిమ ఆసియాను పెను ప్రమాదంలోకి నెట్టివేస్తోంది.

మరోవైపు ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ తన పంతాన్ని వీడడం లేదు. అమెరికాఇజ్రాయెల్ కూటమికి వ్యతిరేకంగా తమ పోరాటం చివరి రక్తపు చుక్క వరకు కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. అయితే, ట్రంప్ మాత్రం ఇరాన్ అంతర్గతంగా బలహీనపడిందని, నాయకత్వ లేమితో కొట్టుమిట్టాడుతోందని విమర్శించారు. ఇరాన్ ప్రజలే ఆ పాలకులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసే రోజు దగ్గర్లోనే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పడానికి ఏ చర్యకైనా వెనుకాడబోనని ఆయన సంకేతాలిచ్చారు. మొత్తానికి పశ్చిమ ఆసియాలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తాయా అన్న ఆందోళన కలగజేస్తున్నాయి. ఒకవైపు ఇజ్రాయెల్ భీకర దాడులు, మరోవైపు ఇరాన్ ప్రతి దాడులు, మధ్యలో అగ్రరాజ్యం అమెరికా హెచ్చరికలతో గల్ఫ్ ప్రాంతం నివురు గప్పిన నిప్పులా ఉంది. దౌత్యపరమైన చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే అవకాశాలు ప్రస్తుతానికి కనిపించడం లేదు. రాబోయే 24 గంటలు ఈ యుద్ధ గమనాన్ని నిర్ణయించే అవకాశం ఉంది.

# గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్ పంజా

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడమే కాదు, ఇప్పుడు అగ్నిపర్వతంలా విస్ఫోటనం చెందాయి. గత కొన్ని రోజులుగా ఉప్పు నిప్పులా సాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు ప్రత్యక్ష దాడుల రూపం దాల్చాయి. తాజాగా దుబాయ్‌లోని అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంపై ఇరాన్ భారీ డ్రోన్ దాడికి దిగడం ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ వంటి దుబాయ్‌పై ఈ స్థాయిలో దాడి జరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. డ్రోన్లు పేలిన వెంటనే ఆ ప్రాంతంలో భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ఆకాశమంతా నల్లటి పొగ అలుముకున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. పర్యాటకానికి, వ్యాపారానికి అడ్డాగా ఉన్న గల్ఫ్ దేశాలపై ఇలాంటి దాడులు జరగడం చూస్తుంటే పరిస్థితి చేజారిపోయిందని అర్థమవుతోంది. ఈ యుద్ధానికి అసలు బీజం గత నెల 28న పడింది. ఇరాన్ గుండెకాయ వంటి అధ్యక్ష భవనంపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు సంయుక్తంగా మెరుపు దాడి చేశాయి. ఈ భీకర పోరులో ఇరాన్ అత్యున్నత నాయకుడు, ఆ దేశ సర్వోన్నత శక్తి అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. దశాబ్దాలుగా ఇరాన్‌ను నడిపిస్తున్న ఒక శక్తివంతమైన నేతను కోల్పోవడంతో ఇరాన్ ప్రభుత్వం తీవ్ర ఆగ్రహంతో ఉంది. తమ దేశ గౌరవానికి భంగం కలిగిందనే భావనతో ఇరాన్ ఇప్పుడు ప్రతీకార జ్వాలతో రగిలిపోతోంది. ఖమేనీ మరణానికి సమాధానంగా ఇజ్రాయెల్‌ను మ్యాప్ నుంచి తుడిచిపెడతామని, దానికి సహకరిస్తున్న అమెరికా మిత్రదేశాలను వదిలే ప్రసక్తే లేదని ఇరాన్ సైన్యం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

అయతుల్లా అలీ ఖమేనీ మృతి తర్వాత ఇరాన్ తన వ్యూహాన్ని పూర్తిగా మార్చేసింది. ఇదివరకు కేవలం ప్రాక్సీ గ్రూపుల ద్వారా దాడులు చేయించే టెహ్రాన్, ఇప్పుడు నేరుగా రంగంలోకి దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు అమెరికాకు మద్దతుగా నిలుస్తున్న గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకోవడం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ముఖ్యంగా దుబాయ్ లాంటి ఆర్థిక



హబ్‌లను దెబ్బకొట్టడం ద్వారా అమెరికా ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీయాలని ఇరాన్ భావిస్తోంది. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు అత్యాధునిక సాంకేతికతతో కూడినవని, వీటిని అడ్డుకోవడం చాలా కష్టమని రక్షణ నిపుణులు చెబుతున్నారు. ఈ దాడుల వల్ల గల్ఫ్ దేశాల్లోని విదేశీ పెట్టుబడిదారుల్లో ఒక్కసారిగా ఆందోళన మొదలైంది. ఇజ్రాయెల్ కూడా ఏమాత్రం తగ్గడం లేదు. ఇరాన్ చేస్తున్న దాడులకు అంతకు రెట్టింపు స్థాయిలో బదులిస్తోంది. ఇప్పటికే ఇరాన్‌లోని ప్రధాన అణు కేంద్రాలు, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వాయుసేన బాంబుల వర్షం కురిపిస్తోంది. అమెరికా తన అత్యాధునిక యుద్ధ విమానాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలను మధ్యధరా సముద్రంలో మోహరించింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాట్లాడుతూ, తమ జోలికి వస్తే సహించేది లేదని, ఇరాన్‌ను దశాబ్దాల వెనక్కి నెట్టేస్తామని ఘాటుగా వ్యాఖ్యానించారు. అగ్రరాజ్యం అమెరికా మద్దతు ఇజ్రాయెల్‌కు ఉండటంతో ఈ యుద్ధం కేవలం రెండు దేశాల మధ్యే కాకుండా, అగ్రరాజ్యాల ఆధిపత్య పోరులా మారుతోంది.

యుద్ధం ఉధృతం కావడంతో గల్ఫ్ దేశాల్లో భయానక వాతావరణం నెలకొంది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ వంటి దేశాలు తమ గగనతలాన్ని మూసివేస్తున్నాయి. అనేక అంతర్జాతీయ విమానాలు రద్దు కావడంతో వేల సంఖ్యలో ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ముఖ్యంగా దుబాయ్ ఎయిర్‌పోర్టులో ట్రాఫిక్ నిలిచిపోవడం ప్రపంచ విమానయాన రంగాన్ని కుదిపేస్తోంది. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉంది. ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ వంటి దేశాలకు ఇది పెద్ద తలనొప్పిగా మారనుంది, ఎందుకంటే మనం చమురు కోసం ఎక్కువగా గల్ఫ్ దేశాలపైనే ఆధారపడుతున్నాం.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు చూస్తుంటే యుద్ధం ఎంత భయంకరంగా ఉందో అర్థమవుతోంది. డ్రోన్ దాడులకు సంబంధించి ప్రజలు తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించిన దృశ్యాలు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. పొగచూరిన ఆకాశం, బాంబు పేలుళ్ల శబ్దాలు, ప్రజల అరుపులతో ఆ ప్రాంతం యుద్ధ భూమిని తలపిస్తోంది. నేటి తరం యువత ఈ యుద్ధాన్ని లైవ్ అప్‌డేట్స్ ద్వారా ఎప్పటికప్పుడు గమనిస్తోంది. ఒకప్పుడు వార్తా పత్రికలు, టీవీల్లో మాత్రమే వచ్చే యుద్ధ వార్తలు ఇప్పుడు 'ఎక్స్', టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా సెకన్ల వ్యవధిలో ప్రపంచవ్యాప్తంగా వ్యాపిస్తున్నాయి. ఈ సమాచార విప్లవం యుద్ధంపై ప్రజల అభిప్రాయాన్ని కూడా ప్రభావితం చేస్తోంది. అంతర్జాతీయ సమాజం ఈ పరిస్థితిని చూసి ఆందోళన చెందుతోంది. ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ఇరు పక్షాలకు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. కానీ, ప్రతీకారేచ్ఛతో ఉన్న ఇరాన్ చర్చలకు సిద్ధంగా లేనట్లు కనిపిస్తోంది. రష్యా, చైనా వంటి దేశాలు ఇరాన్‌కు పరోక్షంగా మద్దతు ఇస్తుండగా, యూరోపియన్ యూనియన్ దేశాలు ఇజ్రాయెల్ వెనుక నిలుస్తున్నాయి. దీనివల్ల ప్రపంచం రెండు వర్గాలుగా చీలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. ఇది కేవలం పశ్చిమాసియా ప్రాంతీయ యుద్ధంగా మిగిలిపోతుందా లేక మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందా అన్న భయం అందరిలోనూ నెలకొంది. ఆయుధ పోటీ పెరగడం వల్ల అమాయక ప్రజలు బలికావడం అత్యంత బాధాకరం. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం ఆ దేశ చరిత్రలో ఒక పెద్ద మలుపు. ఆయన మరణం వల్ల ఏర్పడిన శూన్యాన్ని పూడ్చుకోవడానికి ఇరాన్ సైన్యం ఎంతటి సాహసానికైనా సిద్ధపడుతోంది. ఒకవేళ ఇరాన్ గనుక అణు ఆయుధాలను ప్రయోగిస్తే పరిస్థితి ఊహకందని విధంగా మారుతుంది. ఇజ్రాయెల్ వద్ద ఉన్న 'ఐరన్ డోమ్' వ్యవస్థ ఇరాన్ ప్రయోగించే వందలాది క్షిపణులను అడ్డుకుంటున్నా, డ్రోన్ దాడులు మాత్రం సవాలుగా మారుతున్నాయి. దుబాయ్ లాంటి అత్యాధునిక నగరాలు ఇప్పుడు తమ రక్షణ వ్యవస్థలను పటిష్టం చేసుకునే పనిలో పడ్డాయి. పర్యాటకులు ఈ ప్రాంతాన్ని వీడి స్వదేశాలకు పయనమవుతుండటంతో గల్ఫ్ ఆర్థిక వ్యవస్థపై కోలుకోలేని దెబ్బ పడేలా ఉంది. ప్రస్తుత తరం ఈ యుద్ధాన్ని ఒక డిజిటల్ రియాలిటీలా చూస్తున్నా, దీనివల్ల కలిగే పర్యవసానాలు మాత్రం చాలా వాస్తవంగా ఉండబోతున్నాయి. ఆహార ధాన్యాల కొరత, ఇంధన ధరల పెరుగుదల, స్టాక్ మార్కెట్ల పతనం వంటివి ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ప్రతి ఒక్కరి జేబుపై ఈ యుద్ధ ప్రభావం పడనుంది. ముఖ్యంగా టెక్నాలజీ, గ్లోబల్ సప్లై చైన్ దెబ్బతినడం వల్ల రాబోయే రోజుల్లో ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ గందరగోళం ఎప్పుడు ముగుస్తుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. శాంతి చర్చలు విఫలమైతే పశ్చిమాసియా మరిన్ని శ్మశానాలను చూడాల్సి వస్తుందని విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్నికల బాస్‌పై యుద్ధం

**విశాలభారతి, జాతీయం:**

భారత ప్రజాస్వామ్య చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని కోరుతూ విపక్షాలు పార్లమెంట్‌లో పావులు కదిపాయి. దేశ ఎన్నికల వ్యవస్థ నిష్పక్షపాతంగా ఉండాలని కోరుతూ ఇండియా కూటమికి చెందిన ఎంపీలు ఉభయ సభల్లోనూ అభిశంసన తీర్మాన నోటీసులు అందజేయడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించింది. శుక్రవారం లోక్‌సభ స్పీకర్‌కు, రాజ్యసభ ఛైర్మన్‌కు విడివిడిగా ఈ నోటీసులను అందజేసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామం భారత ఎన్నికల కమిషన్ స్వయంప్రతిపత్తిపై జరుగుతున్న చర్చను మరోసారి జాతీయ స్థాయిలో తెరపైకి తెచ్చింది. ఈ నోటీసుపై ప్రతిపక్షాల ఐక్యత స్పష్టంగా కనిపిస్తోంది. లోక్‌సభలో సుమారు 130 మంది సభ్యులు, రాజ్యసభలో 63 మంది సభ్యులు సంతకాలు చేయడం ద్వారా ఈ తీర్మానానికి ఉన్న బలాన్ని చాటిచెప్పారు. కేవలం ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలే కాకుండా, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ఇతర పార్టీలు, కొంతమంది స్వతంత్ర ఎంపీలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై పార్లమెంటులో ఇలాంటి నోటీసు రావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. దేశ అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఒకటైన సీఈసీపై విపక్షాలు ఇంతటి కఠిన నిర్ణయం తీసుకోవడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా జ్ఞానేష్ కుమార్‌పై ఏడు రకాల తీవ్రమైన అభియోగాలను విపక్షాలు మోపాయి. విధి నిర్వహణలో పక్షపాత ధోరణి ప్రదర్శించడం, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం వంటివి ఇందులో ప్రధానమైనవి. ముఖ్యంగా ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) సమయంలో పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు జరిగిందని, ఇది ఉద్దేశపూర్వకంగానే జరిగిందని ఎంపీలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లోపించిందని, అధికార బీజేపీ ప్రయోజనాల కోసం రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్నారని విపక్ష నేతలు ఘాటుగా విమర్శిస్తున్నారు. ఎన్నికల అక్రమాలపై వచ్చే ఫిర్యాదుల విషయంలో సీఈసీ ఉద్దేశపూర్వకంగానే దర్యాప్తును అడ్డుకుంటున్నారని నోటీసులో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి వెన్నెముక లాంటి ఎన్నికల ప్రక్రియను కలుషితం చేసేలా ప్రధాన కమిషనర్ వ్యవహరించడం




రాజ్యాంగ విరుద్ధమని విపక్షాలు వాదిస్తున్నాయి. పక్షపాత ధోరణితో వ్యవహరించే వ్యక్తి సీఈసీ పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, అందుకే తాము ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై మరింత మంది ఎంపీలు సంతకాలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నారని, రాబోయే రోజుల్లో ఈ సెగ మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించాలంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించడానికి అనుసరించే క్లిష్టమైన ప్రక్రియనే పాటించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ ప్రారంభం కావాలంటే లోక్‌సభలో కనీసం 100 మంది, రాజ్యసభలో కనీసం 50 మంది సభ్యుల మద్దతుతో నోటీసు ఇవ్వాలి. ప్రస్తుత సందర్భంలో విపక్షాలు ఈ సంఖ్యాబలాన్ని సునాయాసంగా అధిగమించాయి. ఉభయ సభల్లోనూ నోటీసులు అందజేసిన తర్వాత, సభాపతులు వీటిని పరిశీలించి అనుమతించాల్సి ఉంటుంది. ఒకవేళ నోటీసు ఆమోదం పొందితే, తదుపరి విచారణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటవుతుంది. ఈ ప్రక్రియలో భాగంగా స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ కలిసి ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా మరో న్యాయమూర్తి, ఏదైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒక ప్రముఖ న్యాయకోవిదుడు సభ్యులుగా ఉంటారు.

# అన్నదాతకు 'మోదీ' భరోసా

**మొదటిపేజీ తరువాయి**




వ్యవహరిస్తూ దేశం పట్ల తనకున్న నిబద్ధత లోపాన్ని చాటుకుంటోందని విమర్శించారు. గత దశాబ్ద కాలంగా అస్సాంలో జరుగుతున్న మౌలిక సదుపాయాల కల్పన మరియు సామాజిక మార్పులు ఈశాన్య రాష్ట్రాలన్నింటికీ ఒక దిక్సూచిలా మారాయని ప్రధాని మోదీ అభివర్ణించారు. ముఖ్యంగా దశాబ్దాలుగా అన్యాయానికి గురవుతున్న టీ తోట కార్మికులకు భూమి పట్టాలను అందించడం ద్వారా ఒక చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దామని ఆయన సగర్వంగా ప్రకటించారు. "నేను ఒకప్పుడు టీ అమ్మిన వాడిని, ఈ రోజు టీ తోట కార్మికులకు భూమి హక్కులు కల్పించడం ద్వారా నా పాత రుణాన్ని తీర్చుకుంటున్నాను" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో భావోద్వేగాన్ని నింపాయి. టీ కార్మికుల శ్రమ వల్ల అస్సాం ప్రపంచ పటంలో గుర్తింపు పొందిందని, కానీ గత కాంగ్రెస్ పాలకులు వారి ఓట్ల కోసం వాడుకుని వారి బతుకులను గాలికొదిలేశారని మోదీ దుయ్యబట్టారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై స్పందిస్తూ, అంతర్జాతీయంగా యుద్ధాలు మరియు సరఫరా గొలుసులో ఆటంకాలు ఏర్పడినప్పుడు దాని ప్రభావం నేరుగా రైతుపై పడకుండా కేంద్రం రక్షణ కవచంలా నిలుస్తోందని ప్రధాని వివరించారు. ఉక్రెయిన్ యుద్ధం లేదా కొవిడ్ మహమ్మారి వంటి విపత్కర పరిస్థితుల్లో అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు ఆకాశాన్నంటినా, భారత ప్రభుత్వం ఆ భారాన్ని రైతులపై పడనీయలేదని గుర్తుచేశారు. విదేశాల్లో రూ. 3,000 పలికే యూరియా బస్తాను ప్రభుత్వం భారీగా సబ్సిడీ ఇచ్చి కేవలం రూ. 300కే అందిస్తోందని, ఇందుకోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఏకంగా రూ. 12 లక్షల కోట్లను వెచ్చించామని ఆయన గణాంకాలతో సహా వివరించారు. కాంగ్రెస్ హయాంలో రైతుల స్థితిగతులను, ప్రస్తుత ఎన్డీయే పాలనను పోలుస్తూ మోదీ ఘాటైన విమర్శలు చేశారు. 2014కు ముందు పదేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం కనీస మద్దతు ధర రూపంలో రైతులకు కేవలం రూ. 6.5 లక్షల కోట్లు మాత్రమే అందించిందని, అదే తమ ప్రభుత్వం గత పదేళ్లలో రైతులకు రూ. 20 లక్షల కోట్లకు పైగా నేరుగా చెల్లించిందని తెలిపారు. పీఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటివరకు రూ. 4.20 లక్షల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లోకి చేరడం అనేది ఒక రికార్డు అని, ఇది చూసి సహించలేని కాంగ్రెస్ నాయకులు రైతులకు మేలు జరుగుతున్న ప్రతిసారీ అసత్య ప్రచారాలకు తెరలేపుతున్నారని ఆయన మండిపడ్డారు.

ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్తతల విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరును ప్రధాని తప్పుబట్టారు. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ దేశంలో భయాందోళనలు సృష్టించేందుకు విపక్షం ప్రయత్నిస్తోందని, వారికి చరిత్రపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గతంలో నెహ్రూ స్వయంగా కొరియా యుద్ధం వల్ల భారత్‌లో ధరలు పెరుగుతున్నాయని చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ తన సొంత నాయకుల ప్రసంగాలను ఒకసారి వింటే జ్ఞానోదయం కలుగుతుందని హితవు పలికారు. సంక్షోభ సమయాల్లో దేశం ఐక్యంగా ఉండాలి కానీ, కాంగ్రెస్ మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు.

అస్సాం అభివృద్ధిని చూసి సరిహద్దు రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్ ప్రజలు కూడా మార్పును కోరుకుంటున్నారని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అస్సాంలో గత పదేళ్లలో జరిగిన రోడ్ల నిర్మాణం, రైల్వే నెట్‌వర్క్ విద్యుదీకరణ వంటి అంశాలు బెంగాల్ ప్రజలను ఆకర్షిస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో అక్కడ కూడా బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా రైల్వేలను పూర్తిస్థాయిలో విద్యుదీకరించడం వల్ల ఏటా 17 మిలియన్ లీటర్ల డీజిల్ ఆదా అవుతోందని, ఇది పర్యావరణానికే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ఎంతో మేలు చేకూరుస్తుందని ప్రధాని పేర్కొన్నారు.

ఈశాన్య భారతాన్ని 'అష్టలక్ష్మి'గా అభివర్ణిస్తూ, ఈ ప్రాంతం దేశ వృద్ధికి పవర్ హౌస్‌లా మారుతోందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంతాన్ని కేవలం మ్యాప్‌లో భాగంగానే చూసేవారని, కానీ తమ ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాలను అభివృద్ధికి చిరునామాగా మార్చిందని చెప్పారు. ప్రతి గ్రామానికి ఇంటర్నెట్, ప్రతి ఇంటికి గ్యాస్ కనెక్షన్, ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందించడం ద్వారా అట్టడుగు వర్గాల ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపామని ఆయన వెల్లడించారు. రైతులకు సాంకేతికతను చేరువ చేయడం ద్వారా, దళారీల ప్రమేయం లేకుండా నేరుగా వారి మొబైల్ ఫోన్లకే ప్రభుత్వ పథకాల సమాచారం చేరుతోందని ఆయన వివరించారు.

డిజిటల్ ఇండియా విప్లవం వల్ల కోట్లాది మంది రైతులు ఈ రోజు బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చారని ప్రధాని ప్రశంసించారు. 2014కు ముందు చాలా మంది రైతులకు బ్యాంక్ ఖాతాలు లేవని, అలాంటిది నేడు నేరుగా లక్షల కోట్లు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని, ఇది విప్లవాత్మక మార్పు అని కొనియాడారు. టెక్నాలజీ ద్వారా పారదర్శకత పెరిగిందని, దీనివల్ల కాంగ్రెస్ కాలంలో జరిగే అవినీతికి అడ్డుకట్ట పడిందని మోదీ వ్యాఖ్యానించారు. రైతుల చెమట చుక్కకు తగిన విలువ కట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన పునరుద్ఘాటించారు. చివరగా, అస్సాం ప్రజల ఆశీస్సులు తనకు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. టీ తోటల సంస్కృతి అస్సాం జీవన నాడి అని, అక్కడ పనిచేసే ప్రతి కార్మికుని సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు. దేశం 2047 నాటికి వికసిత భారత్‌గా మారాలంటే రైతుల అభివృద్ధి ఎంతో అవసరమని, ఆ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రైతుల ఖాతాల్లో జమ అయిన పీఎం కిసాన్ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వస్తామని మోదీ హామీ ఇచ్చారు. అస్సాం నుంచి ప్రారంభమైన ఈ అభివృద్ధి ప్రభంజనం దేశం నలుమూలలా విస్తరిస్తోందని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలను చూపిస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. రైతులు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే కాకుండా, వారి సాగు ఖర్చులను తగ్గించేందుకు డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. దేశాభివృద్ధికి అడ్డంకిగా మారిన కాంగ్రెస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో వారే తగిన గుణపాఠం చెబుతారని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.

## ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల విషయంలో ఆందోళన వద్దు

- జిల్లా అవసరాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయి
- పర్యవేక్షక కమిటీ సమావేశంలో కలెక్టర్ వెల్లడి
- అక్రమాలకు ఆస్కారం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

**నిజామాబాద్, విశాలభారతి:** వంట గ్యాస్ సిలిండర్ల విషయంలో ప్రజలు ఎవరు కూడా ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జిల్లా అవసరాలకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని, జిల్లాలో గ్యాస్ కొరత ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పర్యవేక్షక కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో వంట గ్యాస్ డిమాండ్, సరఫరా తీరుతెన్నుల గురించి ఈ సమావేశంలో సమీక్షించారు. జిల్లాలో 5,81,769 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, 33 గ్యాస్ ఏజెన్సీల ద్వారా సరఫరా జరుగుతోందని, శుక్రవారం నాటికి 10,850 సిలిండర్లు జిల్లాలో గృహావసరాల కోసం పంపిణీ నిమిత్తం అందుబాటులో ఉన్నాయని, వీటికి అదనంగా మరో 5,875 సిలిండర్లు జిల్లాకు రానున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సిలిండర్ బుక్ చేసిన వారికి మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో గృహావసరాల సిలిండర్లు పంపిణీ చేయబడుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎల్.పీ.జీ సిలిండర్ల పంపిణీని నిశితంగా పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్ లో గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తే, నిత్యావసర సరకుల చట్టం, 1955 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే తనిఖీలను ముమ్మరం చేయించామని, ప్రస్తుత మార్చి నెలలో ఎన్ ఫోర్స్ మెంట్ బృందాలు ఆకస్మిక దాడులు జరిపిన సందర్భంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 156 డొమెస్టిక్ సిలిండర్లను వివిధ వ్యాపార, వాణిజ్య దుకాణాల నుండి స్వాధీనం చేసుకుని వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేశారని కలెక్టర్ వివరించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఎ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, డీ.టీ.ఓ ఉమామహేశ్వర్ రావు, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు, డీ.డబ్ల్యూ.ఓ పద్మ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి, ఆర్ సీ ఓ లు, గ్యాస్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, ఎల్.పీ.జీ డీలర్లు పాల్గొన్నారు.



# 7 వేల కోట్లతో గాంధీ సరోవర్

**మొదటిపేజీ తరువాయి**

ఒక పక్కా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. గండిపేట నుంచి గౌరెల్లి వరకు ఉన్న 55 కిలోమీటర్లపరిధిని ఐదు ప్రత్యేక జోన్లుగా విభజించి, దశలవారీగా పనులు చేపట్టనున్నారు. ఇందులో భాగంగానే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన డీపీఆర్ ఇప్పటికే విడుదలైంది. గండిపేట నుంచి గాంధీ సరోవర్ వరకు ఉన్న 21 కిలోమీటర్ల ప్రాంతాన్ని మొదటి జోన్‌గా గుర్తించి, సుమారు 7 వేల కోట్ల రూపాయలతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రాజెక్టు కేవలం సుందరీకరణకే పరిమితం కాకుండా, నది చుట్టూ ఉన్న ప్రజల జీవన ప్రమాణాలను పెంచే విధంగా రూపకల్పన చేశారు. నదికి జీవం పోయాలంటే నిరంతర నీటి ప్రవాహం ఉండాలి. అందుకే ప్రభుత్వం జలమండలికి కేటాయించిన గోదావరి జలాల్లో నుంచి సుమారు 2.5 టీఎంసీలను మూసీ పునరుజ్జీవం కోసం మళ్లించనుంది. ఏడాది పొడవునా నదిలో స్వచ్ఛమైన నీరు పారేలా చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటమే కాకుండా, భూగర్భ జల మట్టం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 365 రోజులు మూసీ పరవళ్లు తొక్కేలా చేయడం ఈ మాస్టర్ ప్లాన్ ప్రధాన ఆకర్షణ. దీనికోసం అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో భాగంగా మెన్ హార్డ్, క్యుష్మాన్ అండ్ వేక్ ఫీల్డ్ వంటి అంతర్జాతీయ స్థాయి కన్సార్షియమ్‌లకు బాధ్యతలు అప్పగించారు. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా నది పొడవునా 9 కొత్త వంతెనలను నిర్మించడమే కాకుండా, ఇప్పటికే ఉన్న 5 చారిత్రక వంతెనలకు ఆధునిక హంగులు అద్దనున్నారు. నదిలో నీటి మట్టాన్ని క్రమబద్ధీకరించడానికి 3 వ్యూహాత్మక బ్యారేజీలను నిర్మించనున్నారు. కేవలం వంతెనలు, బ్యారేజీలే కాకుండా నది వెంట ఉన్న బఫర్ జోన్లను



ఆక్రమణల నుంచి విముక్తం చేసి, ఆ ప్రాంతాలను పచ్చని పార్కులుగా, నడక దారులుగా మారుస్తారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే 27 ప్రధాన నాలాలు, ఇతర చిన్న నాలాలను మూసీలోకి నేరుగా కలవకుండా అడ్డుకట్ట వేయనున్నారు. ప్రతి చుక్క నీరు ఎస్టీపీలలో శుద్ధి అయిన తర్వాతే నదిలోకి ప్రవేశించేలా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.

మురికి కూపంగా మారిన మూసీని చూసి నిరాశ చెందిన నగర ప్రజలకు, ఈ ప్రాజెక్టు ఒక కొత్త ఆశను చిగురింపజేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో డీపీఆర్ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులు కూడా పాల్గొని, ప్రాజెక్టు అమలులో రాజకీయ చిత్తశుద్ధిని చాటుకున్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎం.డి. వెంకట నర్సింహారెడ్డి ఇచ్చిన ప్రెజెంటేషన్ ద్వారా నది రూపురేఖలు ఎలా మారబోతున్నాయో స్పష్టమైంది. 36 నెలల స్వల్ప వ్యవధిలో మొదటి దశను పూర్తి చేయాలనే లక్ష్యం ప్రభుత్వం వేగాన్ని సూచిస్తోంది. పట్టణీకరణ వేగంగా జరుగుతున్న తరుణంలో ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఒక పెద్ద సవాలు. మూసీలో చెత్త వేయకుండా, వ్యర్థాలు పేరుకుపోకుండా అత్యాధునిక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. నది లోపలి ప్రవాహంతో పాటు, ఇరువైపులా ఉన్న సామాజిక వనరులను అభివృద్ధి చేయడం ద్వారా ఇది ఒక ఆర్థిక హబ్‌గా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రివర్ ఫ్రంట్ వెంబడి పర్యాటక కేంద్రాలు, వాణిజ్య సముదాయాలు వెలిస్తే నగర ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న మూసీ ప్రాజెక్టును కేవలం ప్రభుత్వ బాధ్యతగానే కాకుండా, ప్రతి పౌరుడి బాధ్యతగా గుర్తించాలని సీఎం పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే మూసీ నదిని కాపాడుకోవడం అంటే, మన భవిష్యత్తును మనం భద్రపరుచుకోవడమే. గత పాలకులు విస్మరించిన ఈ ప్రాజెక్టును రేవంత్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో ముందుకు తీసుకెళ్తోంది. నగర నడిబొడ్డున పారుతున్న మురికి కాలువను ఒక అద్భుతమైన పర్యాటక క్షేత్రంగా మార్చడం ద్వారా ప్రపంచ దేశాల దృష్టిని హైదరాబాద్ వైపు తిప్పాలని చూస్తున్నారు. ఇందుకోసం ఖర్చు చేసే ప్రతి పైసా కూడా నగరం యొక్క స్థిరమైన అభివృద్ధికి పెట్టుబడిగా మారుతుంది. పర్యావరణవేత్తలు, పట్టణ ప్రణాళికా నిపుణులు సైతం ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. వచ్చే మూడేళ్లలో మన మూసీ నది లండన్ లోని థేమ్స్ నది తరహాలో లేదా అహ్మదాబాద్‌లోని సబర్మతీ రివర్ ఫ్రంట్ తరహాలో దర్శనమివ్వనుంది. ఈ మార్పు కేవలం బాహ్య సుందరీకరణకే పరిమితం కాకుండా, నగర జీవన నాణ్యతను మెరుగుపరుస్తుంది. గండిపేట నుంచి ఓఆర్ఆర్ వరకు సాగే ఈ 55 కిలోమీటర్ల ప్రయాణం హైదరాబాద్ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించబోతోంది. సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే, ఆధునిక వసతులతో నగరాన్ని ముందుకు నడిపించడమే ఈ పునరుజ్జీవన కార్యక్రమం యొక్క అసలు ఉద్దేశం. మూసీ ప్రక్షాళన అనేది ఒక కల మాత్రమే కాదు, అది సాకారం కావాల్సిన అవసరం. ఈ దిశగా పారదర్శకమైన విధానాలతో, గడువులోగా పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అంతర్జాతీయ కంపెనీల భాగస్వామ్యం, భారీ బడ్జెట్ కేటాయింపులు చూస్తుంటే మూసీ నదికి పట్టిన గ్రహణం త్వరలోనే వీడిపోనుందని అర్థమవుతోంది. విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ కిరీటంలో మూసీ పునరుజ్జీవం ఒక కలికితురాయిగా నిలవనుంది. తెలంగాణ ఆయువుపట్టైన హైదరాబాద్‌ను అన్ని కోణాల్లో రక్షించుకోవడానికి ఈ ప్రాజెక్టు ఒక గట్టి పునాది కానుంది.

# పేదల గూడు చెదరనీయం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మూసీ నది ప్రక్షాళన అంశం ఇప్పుడు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది. ఈ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై భారతీయ జనతా పార్టీ తన గళాన్ని మరింత పెంచింది. మూసీ నదిని శుద్ధి చేయాలన్న సంకల్పం మంచిదే అయినప్పటికీ, ఆ పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను నేలమట్టం చేయడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తే ప్రజల పక్షాన పోరాటం తప్పదని హెచ్చరించారు. అభివృద్ధి పేరిట సామాన్యుల గుండెల్లో గునపాలు దించడం ఏమాత్రం సమర్థనీయం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. మూసీ నది ప్రక్షాళన పట్ల గానీ, గాంధీ సరోవర్ ప్రాజెక్టు పట్ల గానీ బీజేపీకి ఎలాంటి వ్యక్తిగత వ్యతిరేకత లేదని రామచందర్ రావు వివరించారు. మూసీ నది కృష్ణా నదిలో కలిసే వరకు స్వచ్ఛంగా ఉండాలన్నదే తమ అభిమతమని ఆయన పేర్కొన్నారు. నది కలుషితం కావడం వల్ల దిగువన ఉన్న రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులను తాము గుర్తించామని, వారికి నాణ్యమైన సాగునీరు అందాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అయితే, నదిని బాగు చేయడం అంటే దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారిని రోడ్డున పడేయడం కాదని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రక్షాళనను సాకుగా చూపి ఇళ్లను కూల్చడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను రామచందర్ రావు తిప్పికొట్టారు. బీజేపీకి ఒక విధానం లేదని చేస్తున్న ప్రచారాన్ని ఆయన తప్పుబట్టారు. మూసీ శుద్ధి విషయంలో బీజేపీకి స్పష్టమైన విజన్ ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం వందల ఎకరాల భూమిని సేకరించడం, అందుకోసం పేదల నివాసాలను తొలగించడం సరికాదన్నారు. చట్టబద్ధంగా అన్ని అనుమతులతో నిర్మించుకున్న ఇళ్లను కూడా కూల్చివేయాలని చూడటం అమానుషమని, చట్టరీత్యా ఇది సాధ్యపడదని ఆయన హితవు పలికారు.

నదుల ప్రక్షాళన ఏ విధంగా చేయాలో నేర్చుకోవాలంటే గుజరాత్‌లోని సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకోవాలని రామచందర్ రావు సూచించారు. నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును



అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారని గుర్తు చేశారు. అప్పట్లో మోదీ ప్రభుత్వం ఎవరి ఇళ్లనూ అన్యాయంగా కూల్చలేదని, ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాల్లోని నిర్వాసితులకు ముందుగా ఆధునిక వసతులతో కూడిన పక్కా గృహాలను నిర్మించి ఇచ్చిన తర్వాతే పునరావాసం కల్పించారని వివరించారు. అక్కడ అమలు చేసిన పద్ధతిని ఇక్కడ ఎందుకు అనుసరించడం లేదని ఆయన ప్రశ్నించారు.

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని రామచందర్ రావు ఆరోపించారు. అధికారులు చేతిలో గడ్డపారలు పట్టుకుని ఇళ్లను కూలగొట్టేందుకు తిరగడం వల్ల సామాన్య ప్రజలు ప్రాణభయంతో వణికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపాదించుకున్న కూలీనాలీ సొమ్ముతో గూడు నిర్మించుకున్న నిరుపేదలు, మధ్య తరగతి వర్గాల పొట్ట కొట్టవద్దని కోరారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా చేసే పనుల్లో ప్రజల సహకారం ఉండాలే తప్ప, వారి శాపనార్థాలు ఉండకూడదని ఆయన సూచించారు. ఇళ్లను కూలగొట్టకుండానే ప్రత్యామ్నాయ పద్ధతుల్లో సుందరీకరణ చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం ఎందుకు మొండిగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం నాలుగు నుంచి ఐదు వందల ఎకరాల భూమి అవసరమని చెప్పడం వెనుక ఉన్న మతలబు ఏమిటో అర్థం కావడం లేదని రామచందర్ రావు వ్యాఖ్యానించారు. అంత పెద్ద మొత్తంలో భూమిని సేకరించడం వల్ల వేల సంఖ్యలో కుటుంబాలు నిర్వాసితులు అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆకాశమంత ఎత్తున ప్రతిష్ఠించినా తమకు అభ్యంతరం లేదని, అది గర్వించదగ్గ విషయమేనని ఆయన పేర్కొన్నారు. కానీ, ఆ విగ్రహం కింద వేలాది మంది పేదల ఇళ్లు సమాధి కావడం గాంధేయవాదం కాదని ఆయన ఎద్దేవా చేశారు. గాంధీ ఆశయాలకు విరుద్ధంగా పేదలను ఇబ్బంది పెట్టడం తగదన్నారు.

ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయాలని, రీఅలైన్‌మెంట్ ద్వారా ఇళ్లకు నష్టం కలగకుండా ప్రక్షాళన చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న నేటి కాలంలో ఇళ్లను కూల్చకుండానే నదిని ఆధునీకరించడం అసాధ్యమేమీ కాదని రామచందర్ రావు అభిప్రాయపడ్డారు. ఒకవైపు సంక్షేమం గురించి మాట్లాడుతూనే, మరోవైపు పేదల ఇళ్లపై బుల్డోజర్లు పంపడం కాంగ్రెస్ ద్వంద్వ నీతికి నిదర్శనమని విమర్శించారు. అభివృద్ధి అనేది ప్రజల సుఖసంతోషాల కోసం ఉండాలి కానీ, వారిని నిరాశ్రయులను చేసేదిగా ఉండకూడదని స్పష్టం చేశారు.

ప్రభుత్వం తన పంతాన్ని వీడి బాధితుల గోడును వినాలని రామచందర్ రావు కోరారు. ప్రతిపక్ష పార్టీగా తాము అభివృద్ధికి ఎప్పుడూ ఆటంకం కలిగించబోమని, కానీ అన్యాయం జరుగుతుంటే మౌనంగా ఉండబోమని హెచ్చరించారు. మూసీ సుందరీకరణ పేరుతో జరిగే భూసేకరణ వెనుక రియల్ ఎస్టేట్ మాఫియా ప్రయోజనాలు ఉండకూడదని ఆకాంక్షించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిపుణుల కమిటీని వేసి బాధితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి అడుగులు వేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కూల్చివేతల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, ప్రజల్లో ఉన్న భయాందోళనలను పోగొట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పునరావాసం విషయంలో ప్రభుత్వం ఇచ్చే హామీలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ఆచరణలో చూపించాలని కోరారు. ఇళ్ల యజమానులకు తగిన నష్టపరిహారంతో పాటు, మెరుగైన జీవన ప్రమాణాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. మూసీ సుందరీకరణ సామాన్యుల కన్నీటిపై కాకుండా, అందరి సమ్మతితో జరగాలని ఆయన ఆకాంక్షించారు. మొత్తానికి మూసీ ప్రక్షాళన అంశం తెలంగాణలో రాజకీయ వేడిని పెంచుతోంది. ఒకవైపు ప్రభుత్వం పట్టుదలతో ముందుకు వెళ్తుంటే, మరోవైపు బీజేపీ వంటి ప్రతిపక్షాలు పేదల పక్షాన పోరాటానికి సిద్ధమవుతున్నాయి. ప్రజల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యత సాధించడంలో ప్రభుత్వం ఎంతవరకు విజయం సాధిస్తుందో వేచి చూడాలి. ఏదేమైనా, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరాలన్నదే ప్రజాస్వామ్య సారాంశమని, ఈ విషయంలో ప్రభుత్వం పారదర్శకతతో వ్యవహరించాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# అవినీతి అనకొండ రేవంత్ రెడ్డి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదిరి పాకాన పడింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని, పాలన గాలికి వదిలేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బినామీ సంస్థల ఆస్తులను పెంచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రమైన ఆరోపణలు చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రికి బినామీ సంస్థగా భావిస్తున్న కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ కాంట్రాక్టులను కేటాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌కు కేటీఆర్ సుదీర్ఘ లేఖలు రాయడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ప్రమేయంతోనే కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీపై జరుగుతున్న విచారణలను తారుమారు చేస్తున్నారని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. గతంలో ఈ సంస్థపై నమోదైన కేసులకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలను ప్రభుత్వం మాయం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. విచారణలో భాగంగా సేకరించిన అత్యంత ముఖ్యమైన దస్త్రాలు, ఆధారాలు ఇప్పుడు అందుబాటులో లేవని స్వయంగా ప్రభుత్వ అధికారులే హైకోర్టుకు తెలపడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆయన అభివర్ణించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే అధికారులు ఒత్తిడికి లోనై సాక్ష్యాలను మాయం చేశారని, ఇది అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాక్ష్యాలు అదృశ్యమవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థలు, పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకం పూర్తిగా పోయిందని కేటీఆర్ విమర్శించారు. ఒక ముఖ్యమంత్రే స్వయంగా అక్రమాలకు పాల్పడుతూ, తన బినామీ కంపెనీలను కాపాడుకునేందుకు వ్యవస్థలను మేనేజ్ చేస్తుంటే సామాన్యులకు న్యాయం ఎక్కడ జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా క్షీణించిందని, పోలీస్ అధికారులు స్వతంత్రంగా పనిచేసే పరిస్థితి లేదని



ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని ఏజెన్సీలు ముఖ్యమంత్రి కనుసన్నల్లో పనిచేస్తున్నాయని, అందుకే ఈ అక్రమాలను వెలికితీయడంలో అవి విఫలమవుతున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యం అనివార్యమని ఆయన నొక్కి చెప్పారు.

కేఎల్ఎస్ఆర్ కంపెనీ ఆర్థిక పరిస్థితిపై కేటీఆర్ అనేక ప్రశ్నలు సంధించారు. ఇప్పటికే దివాలా ప్రక్రియ ఎదుర్కొంటున్న ఈ సంస్థకు ప్రభుత్వం వందల కోట్ల విలువైన ప్రాజెక్టులను ఎలా అప్పగిస్తుందని ఆయన నిలదీశారు. ఆర్థికంగా కుప్పకూలిన సంస్థలకు ప్రభుత్వ కాంట్రాక్టులు ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏమిటో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. దివాలా తీసిన తర్వాత కూడా ఈ సంస్థకు సుమారు 2,500కు పైగా భారీ కాంట్రాక్టులను అడ్డగోలుగా కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ఇందులో సాగునీటి, తాగునీటి ప్రాజెక్టులతో పాటు యంగ్ ఇండియా స్కూల్ భవన నిర్మాణ పనులు, భారీ రహదారుల పనులు ఉన్నాయని ఆయన లేఖలో వివరంగా పేర్కొన్నారు. అధికార దుర్వినియోగానికి రేవంత్ రెడ్డి పరాకాష్టగా నిలుస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. తన బినామీ సంస్థపై ఉన్న విచారణలను అడ్డుకుంటూ, చట్టం నుండి దాన్ని తప్పించేందుకు ముఖ్యమంత్రి చేయని ప్రయత్నం లేదని మండిపడ్డారు. పక్షపాతం లేకుండా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పాక్షిక విచారణ జరగాలని, అప్పుడే అసలు నిందితులు బయటకు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మధ్య ఉన్న అవినాభావ సంబంధం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, అందుకే ఆయన ఆ సంస్థ ప్రయోజనాల కోసం ఇంతగా దిగజారుతున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాను తన బినామీల పరం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నేషనల్ లా ట్రిబ్యునల్ విచారణలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా జోక్యం చేసుకుంటున్నారన్న వార్తలు భయాందోళన కలిగిస్తున్నాయని కేటీఆర్ అన్నారు. న్యాయపరమైన ప్రక్రియలను కూడా తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని సీఎం భావిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే కేఎల్ఎస్ఆర్ కంపెనీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు తగిన విచారణ చేపట్టి నిజాలను నిగ్గుతేల్చాలని సాక్షాత్తూ సుప్రీం కోర్టు సూచించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఆ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన గుర్తు చేశారు. అత్యున్నత న్యాయస్థానం సూచనలను సైతం బేఖాతరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగ విరుద్ధమని కేటీఆర్ తన లేఖలో తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవినీతి అనకొండలా తయారయ్యారని, ప్రతి ప్రాజెక్టులోనూ తన బినామీ కంపెనీలకే వాటా దక్కేలా చక్రం తిప్పుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ చేసే ఆర్థిక నేరాలు, అక్రమాలకు ప్రభుత్వ అండదండలు ఉండటం వల్లే వారు ఇంత ధైర్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. సామాన్యుల పన్నుల డబ్బును తన బినామీల జేబుల్లోకి మళ్లించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి అండ చూసుకునే ఈ కంపెనీ ప్రతినిధులు అధికారులను బెదిరిస్తున్నారని, అందుకే సాక్ష్యాల మాయం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆయన విశ్లేషించారు. రాష్ట్ర పరిధిలోని ఏ దర్యాప్తు సంస్థ కూడా ఈ కేసులో నిజాలు బయటపెట్టలేదని కేటీఆర్ తేల్చి చెప్పారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు రాసిన లేఖలో కేటీఆర్ కొన్ని కీలక డిమాండ్లను ముందుంచారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ చేస్తున్న ఆర్థిక నేరాలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పిస్తున్న అనుచిత లబ్ధిపై కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌తో పాటు సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ ద్వారా సమగ్ర దర్యాప్తు చేయించాలని ఆయన కోరారు.

# కబ్జాదారులపై హైడ్రా బుల్డోజర్

- ప్లాట్ ఓనర్ల పోరాటం ఫలించింది
- కృష్ణానగర్ సొసైటీలో ఆక్రమించిన ప్లాట్లు స్వాధీనం
- భూ కబ్జాదారులపై పంజా విసిరిన హైడ్రా అధికారులు
- అక్రమణలపై కఠిన చర్యలు – 14 ప్లాట్లు, 15 ఫీట్ల రోడ్డుకు విముక్తి
- కబ్జా చేసిన భూమి విలువ దాదాపు రూ.15 నుంచి రూ.20 కోట్లు

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మేట్ :**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మేట్ మండలం పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామంలో కృష్ణానగర్ వెల్ఫేర్ సొసైటీకి చెందిన భూమిపై జరిగిన భారీ కబ్జాను హైడ్రా అధికారులు తొలగించారు. సర్వే నెంబర్ 454లో ఉన్న కృష్ణానగర్ వెల్ఫేర్ సొసైటీలో మొత్తం 158 ప్లాట్లు ఉండగా, అందులో 14 ప్లాట్లు మరియు 15 ఫీట్ల రోడ్డును పక్కనే ఉన్న పట్టాదారు భూ యజమాని కళింగరావు ఆక్రమించినట్లు ప్లాట్ ఓనర్లు ఆరోపించారు. ఈ విషయమై కృష్ణానగర్ వెల్ఫేర్ సొసైటీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైడ్రా అధికారులను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన హైడ్రా అధికారులు శుక్రవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకొని స్థలాన్ని పరిశీలించారు. ప్లాట్ ఓనర్లు చూపించిన డాక్యుమెంట్స్ ఆధారంగా కళింగరావు 14 ప్లాట్లు మరియు 15 ఫీట్ల రోడ్డును కబ్జా చేసి అక్కడ ప్రహరీ గోడతో పాటు రేకుల షెడ్డు గదులను నిర్మించినట్లు గుర్తించారు. తదుపరి హైడ్రా అధికారులు వెంటనే చర్యలు చేపట్టి కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ గోడను, రేకుల షెడ్లను, గదులను తొలగించారు. కబ్జా చేసిన భూమి విలువ దాదాపు రూ.15 నుంచి రూ.20 కోట్ల వరకు ఉండవచ్చని అధికారులు అంచనావేసినట్లు ప్లాట్ ఓనర్లు అందించిన ఆధారాల ఆధారంగా కబ్జాకు గురైన భూమిని తిరిగి స్వాధీనం చేసి ప్లాట్ ఓనర్లకు అప్పగించారు. ఇంకా మిగిలి ఉన్న నిర్మాణాలను 15 రోజుల గడువులో తొలగించి పూర్తి స్థలాన్ని బాధితులకు అప్పగిస్తామని హైడ్రా అధికారులు వెల్లడించారు. ఘటన స్థలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హయత్‌నగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కబ్జాదారుల కొరల నుండి తమ ప్లాట్లను విముక్తి కలిగించిన సందర్భంగా కృష్ణానగర్ వెల్ఫేర్ సొసైటీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి ప్లాట్ ఓనర్లు హర్షం వ్యక్తం చేశారు. "హైడ్రా జిందాబాద్... రేవంత్ రెడ్డి జిందాబాద్..." అంటూ నినాదాలు చేశారు. ప్లాట్ ఓనర్లకు న్యాయం చేసిన హైడ్రా అధికారులకు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన స్థానిక ప్రజలకు, పోలీస్ సిబ్బందికి, మీడియా ప్రతినిధులకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# ఆర్టీసీ సమ్మె సైరన్



**విశాలభారతి, తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో మళ్లీ సమ్మె సెగలు రాజుకుంటున్నాయి. ఆర్టీసీని పూర్తిస్థాయిలో ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ఏకైక అజెండాతో కార్మిక సంఘాల జేఏసీ సమరశంఖం పూరించింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలపై ప్రభుత్వం మెడలు వంచేందుకు సిద్ధమైన నేతలు, గురువారం హైదరాబాద్‌లోని బస్ భవన్ వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీకి పూర్తిస్థాయి మేనేజింగ్ డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో, సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకన్నను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయానికి చేరుకుని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వానికి 14 రోజుల గడువు ఇస్తున్నామని, ఈలోగా సానుకూల నిర్ణయం రాకపోతే బస్సులు గ్యారేజీలకే పరిమితమవుతాయని నేతలు హెచ్చరించారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ విలీన ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నది జేఏసీ ప్రధాన డిమాండ్‌గా ఉంది. గతంలో జరిగిన హామీలను గుర్తు చేస్తూ, 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని వారు కోరుతున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరల దృష్ట్యా కార్మికుల వేతనాలు పెరగకపోతే జీవనం దుర్భరమవుతుందని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీపై పడుతున్న అదనపు భారాన్ని ప్రభుత్వం సక్రమంగా భర్తీ చేయడం లేదని వారు ఆరోపించారు. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెలా ఇవ్వాల్సిన రూ.350 కోట్లను ఎటువంటి కోతలు లేకుండా, షరతులు లేకుండా విడుదల చేయాలని స్పష్టం చేశారు.

సంస్థలో పేరుకుపోయిన సమస్యలు కార్మికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. సుమారు రూ.2,500 కోట్ల పాత బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల పదవీ విరమణ చేసిన వారికి, విధుల్లో ఉన్న వారికి తీరని అన్యాయం జరుగుతోందని జేఏసీ నేతలు వాపోయారు. ఈ నిధులను తక్షణమే విడుదల చేసి ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా ఆర్టీసీ యూనియన్లపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి, ప్రజాస్వామ్యబద్ధంగా గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే సమ్మెకు వెళ్లడం మినహా తమకు మరో దారి లేదని నేతలు కుండబద్దలు కొట్టారు. 14 రోజుల గడువు ముగిసిన తర్వాత కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చేందుకు ముందు బస్ భవన్ ప్రాంగణం కార్మికుల నినాదాలతో హోరెత్తిపోయింది. శాంతియుత నిరసన చేపట్టిన నేతలు, అక్కడ ఏర్పాటు చేసిన సభలో భావోద్వేగంగా ప్రసంగించారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సుల్లో ప్రైవేట్ డ్రైవర్లను కాకుండా ఆర్టీసీ సొంత ఉద్యోగులనే నియమించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే ఈ బస్సుల్లో పనిచేసే వారికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందజేయాలని ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విధానాల వల్ల సంస్థ ఉనికి ప్రశ్నార్థకమవుతోందని, కార్మికుల కష్టార్జితాన్ని కాపాడాల్సిన బాధ్యత పాలకులదేనని నేతలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. విలీనం విషయంలో కాలయాపన చేయడం వల్ల వేలాది కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని వారు విమర్శించారు.

"విలీనం విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తి లేదు" అంటూ జేఏసీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకుండా అన్యాయంగా యూనియన్లను ఎందుకు రోడ్డుకెక్కించారని వారు ప్రభుత్వాన్ని నిలదీశారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక ఎందుకు విస్మరిస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యంగా గత ప్రభుత్వం ఆమోదించిన విలీన బిల్లు ప్రస్తుతం గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందని, దానికి ఆమోదముద్ర వేయించేందుకు ప్రభుత్వం ఎందుకు చొరవ చూపడం లేదని అడిగారు. కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా వారి గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల సాధన కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని నేతలు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, తమ గోడు వినేవారే కరువయ్యారని కార్మిక సంఘాలు వాపోయాయి. "మా ఓపిక నశించింది.. ఇక నుంచి మా యుద్ధం ప్రభుత్వంతోనే" అని జేఏసీ నేతలు ప్రకటించారు. ఆర్టీసీ మేనేజ్‌మెంట్‌తో తమకు ఎలాంటి వ్యక్తిగత విభేదాలు లేవని, కేవలం ప్రభుత్వ వైఖరిని మాత్రమే నిరసిస్తున్నామని స్పష్టం చేశారు. బడ్జెట్‌లో ఆర్టీసీకి ప్రత్యేక వాటా కేటాయించాలని, అన్ని కేటగిరీల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకునే 'బ్రెడ్ విన్నర్' స్కీమ్‌లో మార్పులు తీసుకురావాలని కోరారు. తమ కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడం తప్ప వేరే మార్గం లేదని వారు తేల్చి చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మిక పక్షపాతి అని చెప్పుకుంటూనే కార్మిక సమాజానికి వ్యతిరేకంగా పనిచేస్తోందని జేఏసీ దుయ్యబట్టింది. రాష్ట్రంలో 'ప్రజాపాలన' జరుగుతోందని అంటున్నా, కనీసం చర్చలకు కూడా పిలవకపోవడం ఏంటని వారు ప్రశ్నించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దాల్సిన ఈ సర్కారు, మిగిలిన ప్రక్రియను ఎందుకు పూర్తి చేయడం లేదని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని సమర్థించుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో రైలును ప్రభుత్వం తన పరిధిలోకి తీసుకున్నప్పుడు, వేలాది మందికి సేవలు అందిస్తున్న ఆర్టీసీని ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని వారు సూటిగా ప్రశ్నించారు.

ఈ పోరాటం ఇక్కడితో ఆగేది కాదని, అవసరమైతే అసెంబ్లీ ముట్టడికి కూడా వెనుకాడబోమని నేతలు హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమే తప్ప, డిమాండ్ల విషయంలో కాంప్రమైజ్ అయ్యేది లేదని తేల్చి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికులందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రయాణికులకు కలిగే ఇబ్బందులకు ప్రభుత్వం మాత్రమే బాధ్యత వహించాలని వారు గుర్తు చేశారు. ఆర్టీసీ ఆస్తులను కాపాడుకుంటూనే, కార్మికుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటామని జేఏసీ ప్రతినిధులు ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్పందనను బట్టి రాబోయే రోజుల్లో తమ నిరసన తీవ్రత ఉంటుందని వారు స్పష్టం చేశారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులతో చర్చలు జరపకపోతే, రాష్ట్ర రవాణా వ్యవస్థ స్తంభించిపోయే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే అనేక సార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో కార్మికులు ఆవేశంతో ఉన్నారు. విలీనం అన్నది కేవలం ఒక డిమాండ్ మాత్రమే కాదని, అది వేలాది మంది కార్మికుల జీవితకాల స్వప్నమని నేతలు వివరిస్తున్నారు. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే, ఈ 14 రోజుల గడువు ముగిసిన మరుక్షణం నుంచే రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. అధికార పక్షం ఈ సమ్మె సెగను ఎలా చల్లారుస్తుందో, ఎన్నికల హామీలను ఏ విధంగా నిలబెట్టుకుంటుందో వేచి చూడాలి.

## గిరిజన విద్యార్థులకు మోడల్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

**గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశి రామ్ నాయక్**



**మహబూబాబాద్, విశాలభారతి:** 2026-27 విద్యా సంవత్సరానికిగాను మోడల్ క్రీడా పాఠశాల కొత్తగూడలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో మొత్తం 40 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే బోయినపల్లి వద్ద ఉన్న వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో కూడా 5వ తరగతిలో 40 సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థులు అర్హులని తెలిపారు. విద్యార్థులు పూర్తి చేసిన దరఖాస్తులను మోడల్ క్రీడా పాఠశాల కొత్తగూడలో లేదా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం, మహబూబాబాద్‌లో సమర్పించవచ్చని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ఎటూరునాగారం ప్రాజెక్టు అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షలు మార్చి 16 నుండి మార్చి 20 వరకు మోడల్ క్రీడా పాఠశాల కొత్తగూడలో నిర్వహించబడతాయని వెల్లడించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన అభ్యర్థులకు మార్చి 28 నుండి మార్చి 30 వరకు ఉమ్మడి జిల్లా స్థాయి ప్రతిభ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 5వ తరగతిలో ప్రవేశాలకు 9 నుండి 11 సంవత్సరాల మధ్య (31 ఆగస్టు 2026 నాటికి) వయస్సు కలిగిన గిరిజన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా క్రీడా పాఠశాల బాలుర కొత్తగూడలో హాజరై పరీక్షల్లో పాల్గొనవచ్చని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఫిజికల్ డైరెక్టర్ సి.హెచ్. కొమ్ములు (9492440710), పి.ఈ.టి, ఈ. దేవేందర్ (9492440711) లేదా క్రీడా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి. సారయ్య (9440697433)లను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

## విద్యార్థులు ఒత్తిడికి గురి కావొద్దు

**మధుసూదన్ రెడ్డి డిఎస్పి**



**చౌటుప్పల్, విశాలభారతి:** పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడికి గురికావద్దని,ప్రశాంతతతో పరీక్షకు హాజరు కావాలని చౌటుప్పల్ డిఎస్పి మధుసూదన్ రెడ్డి అన్నారు.పట్టణ కేంద్రంలోని మోడల్ స్కూల్,కస్తూరిబా గాంధీ విద్యాలయం, అంకిరెడ్డి గూడెం మైనార్టీ గురుకుల పాఠశాల, అంకిరెడ్డి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓరగంటి ఎట్టయ్య అంజమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి కుమారుడు వరగంటి శ్రీనివాస్ గౌడ్ సమకూర్చిన 300 పరీక్ష ప్యాడ్లు పెన్నులు డీఎస్పీ మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థికి ఈ పరీక్ష తొలిమెట్టు అని తెలిపారు.ఉన్నత శిఖరాలు అధిరోహించిన ప్రతి వ్యక్తి ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడని అన్నారు. విద్య పేదరికానికి అడ్డు కాదని చెప్పారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్, ఎంఈఓ గురవరావు, కౌన్సిలర్లు బత్తుల వాణి విప్లవ గౌడ్, బద్రి గాలయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవాని, బాలకృష్ణ, శివ జ్యోతి, నాయకులు తూర్పునూరి రవి గౌడ్, బొమ్మిరెడ్డి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభ కనబరిస్తే ఆర్థిక సహాయం అందజేస్తా



**బూరుగు భరత్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్**

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలం కుంట్లగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని,విద్యార్థులకు బివీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్షల మెటీరియల్ పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ బూరుగు భరత్ రెడ్డి విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 14వ తేదీన ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకుంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఉండాలని, సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.పదవ తరగతిలో మొదటి, రెండవ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎలిజిబెత్, ఫౌండేషన్ ప్రతినిధులు కందగట్ల శివకుమార్, పాపగళ్ళ హరీష్, ఇత్తబోయిన శివకుమార్, కొండే మణికంఠ, చిన్నబోయిన చరణ్, కొండే శ్రీను, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సానిటేషన్ పై స్పెషల్ డ్రైవ్



**విశాలభారతి, గోదావరిఖని:** వరద నీటి కాలువల్లో పూడిక తీత పనులను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీరుస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు . రామగుండం నగర పాలక సంస్థ ఆద్వర్యంలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" లో భాగంగా చేపట్టిన సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను పరిశీలించడానికి శుక్రవారం తెల్లవారుఝామున్నే 3, 48, 49 డివిజన్ లలో పర్యటించి మురుగు నీటి కాలువలను పరిశీలించారు. సాయిలీల హోటల్ ప్రక్క నుండి ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువలో చేపట్టిన పూడిక తీత పనులను పర్యవేక్షించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాలువ నిర్మించకపోవడం , పది సంవత్సరాలుగా సరిగా పూడిక తీయకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి పరిసరప్రాంత వాసులు భరించలేని దుర్గంధంతో పాటు అనేక రోగాల బారిన పడుతున్నారని అన్నారు. మల్కాపూర్ శివారు లో నిర్మిస్తున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుండి టీచర్స్ కాలనీ వరకు వరద నీటి కాలువ కాంక్రీట్ నిర్మాణం చేపట్టి ఒక్క నీటి చుక్క కూడా నిలిచిపోకుండా సాఫీ గా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. నగరంలోని అన్ని ప్రదాన కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు. ఈ సంధర్భంగా ఆయన స్వయంగా జెసిబి యంత్రాన్ని ఆపరేట్ చేసి ముళ్ళ పొదలు, పిచ్చి చెట్లు తొలగించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్ లతో పాటు డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వి. రామన్, టి పి ఎస్ నవీన్ , వార్డు అధికారులు , సానిటరీ ఇన్స్పెక్టర్లు , జవాన్లు , మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా పాఠశాలలో ప్రవేశాలు

**తిరుమలగిరి, శాలభారతి :** తెలంగాణ క్రీడా పాఠశాలలో 20267 విద్యా సంవత్సరానికి నాలుగవ తరగతి ప్రవేశాలకై ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ శాంతయ్య,ఫిజికల్ డైరెక్టర్లు మహేష్,అంబేద్కర్,రజిని, వెంకన్న, రాజీవ్, వీరమల్లు సునీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల కు 9 రకాల ఫిజికల్ టెస్ట్ నిర్వహిస్తామని, ఈనెల 16న మండల స్థాయి సెలక్షన్స్ ఉంటాయని తెలియజేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## చిన్నారులకు ఉచిత యూనిఫాం పంపిణి

**దేవరప్పుల, విశాలభారతి:** దేవరప్పుల మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో అన్న ప్రసన్న, జన్మదిన, వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ స్కూల్లో చదువుతున్న చిన్నారులకు ఉచిత యూనిఫామ్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి ఉప సర్పంచ్ నర్ర కోమలత సోమేశ్వర్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ సావిత్రి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ ఉపాధ్యాయులు సులోచన, అంజమ్మ, శోభ,తో పాటు చిన్నారులు తల్లులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ సావిత్రి మాట్లాడుతూ, గర్భిణీలు బాలింతలు అంగన్వాడి కేంద్రాం లో అందించే పోషకాహారాన్ని తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అలాగే ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రానికి పంపించాలని, తల్లి దండ్రులను కోరారు. అంగన్వాడి కేంద్రంలో తల్లులకు అందించే ఆహారం, మెనూ, ప్రీ స్కూల్ టైంటేబుల్ చిన్నారులకు అందించే పోషకాహారం, వారి ఆరోగ్య ఎదుగుదల మరియు పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఆనందకర వాతావరణంలో సాగగా గ్రామ ప్రజలు తల్లులు సంతోషం వ్యక్తం చేశారు.



## గ్యాస్ సరఫరాలో ఏలాంటి ఇబ్బందులు లేవు



- **జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్,**
- **గ్యాస్ సరఫరాలో అసత్య ప్రచారాలను నమ్మవద్దు,**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్**

**మహబూబాబాద్, విశాలభారతి:**

శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ అనిల్ కుమార్, సివిల్ సప్లై, గ్యాస్ డీలర్స్, విద్యా శాఖ, హాస్పటల్ సంబంధిత అధికారులతో కలిసి గ్యాస్ సరఫరా పై జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం (11) ఏజెన్సీల పరిధిలో 2,12131 గ్యాస్ కనెక్షన్లు కలవని, గతవారం రోజుల నుండి పైన తెలిపిన 11 గ్యాస్ ఏజెన్సీల ద్వారా 13985 సిలిండర్ల వినియోగదారులకు పంపిణీ చేయడం జరిగిందని, డిమాండ్ కు అనుగుణంగా సంబంధిత ఏజెన్సీల వద్ద వినియోగదారులకు సరిపడా గ్యాస్ సిలిండర్లు నిల్వలో సిద్ధంగా ఉన్నాయన్నారు, అనవసరంగా ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, డిమాండ్ కనుగుణంగా గ్యాస్ లభ్యత ఉందని, తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. సివిల్ సప్లై విజిలెన్స్ కమిటీ సభ్యులు నిత్యం గ్యాస్ డీలర్ల వద్ద ఉన్న స్టాకును గమనిస్తూ ఉండాలని వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు గ్యాస్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. హోటళ్ళు, రెస్టారెంట్లలో కమర్షియల్ సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో డెలివరీ బాయ్ కి ఓటీపీ చెప్పి సహకరించాలని, వారి విధులకు ఎవరైనా ఆటంకము కలిగించినట్లయితే, అలాంటి వినియోగదరులపైన కూడా చట్టపరముగా చర్యలు తీసుకోబడతాయని అన్నారు. ఎల్పీజీ వినియోగదారులు తప్పనిసరిగా కేవైసీ పూర్తి చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీల వద్ద, ఆన్లైన్లో కానీ గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్ లేదా యాప్ లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద కేవైసీ పూర్తి చేసుకోవచ్చని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ జిల్లాలో గ్యాస్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేవని సోషల్ మీడియా వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఏట్టి పరిస్థితిలలో అలాంటి వార్తలను నమ్మ వద్దని తెలిపారు, ప్రభుత్వం సూచించిన ప్రకారం 25 రోజుల అనంతరం మాత్రమే గ్యాస్ బుక్ చేసుకోవాలని, గ్యాస్ సరఫరా చేసే వాహనాలను సిబ్బందిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయవద్దని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి రమేష్, డి.ఎస్.పి తిరుపతిరావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, దేశీ రామ్ నాయక్, వెల్ఫేర్ అధికారిని సబిత, సంబంధిత అధికారులు, గ్యాస్ డీలర్ల సంఘం ప్రెసిడెంట్ నిరంజన్ రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు ఆల్ ద బెస్ట్

**ఆదం సంతోష్ కుమార్**

**సికింద్రాబాద్, విశాలభారతి:**

నేడు తెలంగాణ లో ప్రారంభమవుతున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులందరికీ సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సంతోష్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొని మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి లోనవకుండా ప్రశాంతంగా, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్య ఎంతో ముఖ్యమని, ఈ పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమని అన్నారు. అన్ని విషయాల్లో విజయాన్ని సాధించి తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



## అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ నగరంలోని ఖానాపూర్ ప్రాంతంలో ఉన్న విఠ్ఠలేశ్వర నగర్‌లో నిర్వహిస్తున్న "అఖండ హరినామ సప్తాహ" కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భక్తులతో కలిసి భజనలు, హరినామ సంకీర్తనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే , భక్తి కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు ప్రజల్లో సద్భావన, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు యువతకు సనాతన ధర్మ విలువలను తెలియజేయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న విఠ్ఠలేశ్వర నగర్ పెద్దలు మరియు యువ మండలి సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని హరినామ సంకీర్తనతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు, నిర్వాహకులు, భక్తులు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కవిత జన్మదిన వేడుకలు



**నిజామాబాద్, విశాలభారతి:** కవిత కార్యాలయంలో ఈరోజు 48 వ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతిని స్థాపించి తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో క్రియాశీలక పోషించిన కవితక్క తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు కాపాడుతూ బతుకమ్మ బోనాల పండుగలను విస్తృతంగా ప్రచారం చేస్తూ రాష్ట్ర నిర్మాణంలో క్రియా శ్రీలక పాత్ర పోషించిన కవిత జన్మదినం కవిత కార్యాలయంలో నిర్వహించడం జరిగింది . అవంతి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను బతుకమ్మ బోనాలను విశ్వవ్యాప్తంగా చేసిన ఘనత కవితక్కది కరోనా సమయంలో కోవిడ్ పేషెంట్లకు అండగా నిలబడ్డ కవితక్క తెలంగాణ జాగృతి స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన ఘనత కవితక్కది. ఈ కార్యక్రమంలో డి. ప్రవీణ్ కుమార్, హనుమగిరి, గట్టు హరికృష్ణ, కుల్దీప్, పంచ రెడ్డి మురళి, శంకర్, శ్రీనివాస్ గౌడ్, రేఖ,సరిత, శ్రీకాంత్ నాయక్ తదితరులు తెలంగాణ జాగృతి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి కొండ సురేఖకు ఘన స్వాగతం

**పలికిన బొబ్బిలి రామకృష్ణ**



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ కు విచ్చేసిన అటవీ శాఖ పర్యావరణ ఎండోమెంట్స్ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండ సురేఖ కు ఘనంగా స్వాగతం పలికినా నిజామాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ అనంతరం నిజామాబాద్ జిల్లా నర్సింగ్ పల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ,నిజామాబాద్ నగర మేయర్ ఉమా రాణి ,మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత ,పీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, మాజీ నగర మేయర్ ఆకుల సుజాత , ఏఐసీసీ కోఆర్డినేటర్ కప్‌కర్ గన్‌రాజ్ , మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జగడం సుమన్ ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టెహ్రాన్‌లో భారీ పేలుళ్లు

**విశాలభారతి, అంతర్జాతీయం:**

మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ జ్వాలలు భగ్గుమన్నాయి. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌తో పాటు పారిశ్రామిక నగరమైన ఖజ్వీన్‌లో సంభవించిన భారీ పేలుళ్లు ప్రపంచాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. అమెరికా, ఇజ్రాయెల్ వైఖరికి వ్యతిరేకంగా టెహ్రాన్ స్క్వేర్‌లో వేలాది మంది ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్న సమయంలోనే ఈ దాడులు చోటుచేసుకోవడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆకాశమంతా దట్టమైన పొగలు కమ్ముకోగా, భూమి కంపించినట్లుగా పేలుళ్ల తీవ్రత ఉందని ప్రత్యక్ష సాక్షులు సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తున్నారు. అయితే ఈ దాడులకు బాధ్యులు ఎవరనేది అధికారికంగా వెల్లడి కానప్పటికీ, ఇజ్రాయెల్ గతంలోనే ఇచ్చిన హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశమే ఈ దాడులకు పాల్పడి ఉంటుందని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇరాన్ గడ్డపై ఈ దాడులు జరుగుతున్నా అక్కడి ప్రజలు భయం వీడి వీధుల్లోకి రావడం గమనార్హం. టెహ్రాన్ వీధుల్లో నిరసనకారులు భారీ ఎత్తున గుమిగూడి ఇజ్రాయెల్, అమెరికాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారు. దేశభక్తిని చాటుకుంటూనే, తమపై జరుగుతున్న క్షిపణి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇరాన్ అధికారిక మీడియా ఈ పేలుళ్లను ధృవీకరించినప్పటికీ, ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలను ఇంకా వెల్లడించలేదు. ఒకవైపు బాంబుల మోత వినిపిస్తున్నా, మరోవైపు వేలాది మంది సామాన్యులు తమ గళాన్ని వినిపిస్తూ పశ్చిమ దేశాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ఇది ఇరాన్ పాలకులకు నైతిక బలాన్ని ఇస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అత్యంత దారుణంగా మారుతోంది.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన విలక్షణ శైలిలో ఇరాన్‌కు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. "మతి భ్రమించిన నేతలకు ఇవాళ ఏం జరుగుతుందో మీరే కళ్లారా చూస్తారు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ అయ్యాయి. సోషల్ మీడియా వేదికగా ట్రంప్ వరుస పోస్టులతో విరుచుకుపడ్డారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే నామరూపాల్లేకుండా పోయిందని, త్వరలోనే వారి వైమానిక దళం కూడా చరిత్ర పుటల్లో కలిసిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత 47 ఏళ్లుగా ఇరాన్ పాలకులు అమాయకులను పొట్టన పెట్టుకుంటున్నారని, దానికి ముగింపు పలకడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడిగా ఆ బాధ్యతను తాను స్వయంగా తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ట్రంప్ వ్యాఖ్యల వెనుక ఉన్న దూకుడు ఇరాన్ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోంది. కేవలం క్షిపణులు, డ్రోన్లు మాత్రమే కాదు, ఇరాన్ నాయకత్వం కూడా తుడిచి పెట్టుకుపోతోందని ఆయన చేసిన కామెంట్స్ ప్రత్యక్ష యుద్ధ సూచనలను తలపిస్తున్నాయి. జీ7 నేతలతో జరిగిన వర్చువల్ సమావేశంలో కూడా ట్రంప్ ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. ఇరాన్ ఆర్థికంగా, సైనికంగా కుప్పకూలిపోయిందని, మరికొద్ది రోజుల్లోనే ఆ దేశం తమ ముందు లొంగిపోక తప్పదని ఆయన ఇతర దేశాధినేతలకు వివరించినట్లు యాక్సియోస్ వార్తా సంస్థ కథనం వెల్లడించింది. దీనిని బట్టి చూస్తుంటే అమెరికా ఒక పక్కా ప్రణాళికతో ఇరాన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు అర్థమవుతోంది.

మరోవైపు ఉత్తర ఇరాక్‌లో జరిగిన ఒక ఘోర విమాన ప్రమాదం అమెరికాను ఆందోళనకు గురిచేసింది. అమెరికా సైన్యానికి చెందిన కేసీ135 రీఫ్యూయలింగ్ ట్యాంకర్ విమానం కుప్పకూలినట్లు సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రమాదంలో విమానంలో ఉన్న ఆరుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం అమెరికా రక్షణ వర్గాల్లో కలకలం రేపింది. టెక్నికల్ సమస్యల వల్ల ఈ ప్రమాదం జరిగిందా లేక ఇరాన్ అనుకూల ఉగ్రవాద మూకలు ఎవరైనా దాడి చేశారా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది. యుద్ధం తీవ్రతరమవుతున్న తరుణంలో అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోవడం ఆ దేశానికి పెద్ద ఎదురుదెబ్బగా భావించవచ్చు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఇరాన్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి అత్యంత సంక్లిష్టంగా ఉంది. ఒకవైపు స్వదేశంలో నిరసనలు, మరోవైపు సరిహద్దుల్లో విదేశీ దాడులతో ఆ దేశం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఖజ్వీన్ వంటి కీలక నగరాల్లో పేలుళ్లు జరగడం వల్ల ఆ దేశ రక్షణ వ్యవస్థ లోపాలు బయటపడుతున్నాయి. ఇజ్రాయెల్ వ్యూహాత్మక దాడుల ద్వారా ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలను లేదా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఉండవచ్చని సమాచారం. ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే 24 గంటలు ఇరాన్ చరిత్రలో అత్యంత కీలకంగా మారనున్నాయి. పశ్చిమ దేశాల ఆంక్షలు ఒకవైపు, ప్రత్యక్ష దాడులు మరోవైపు ఇరాన్ ఆర్థిక వ్యవస్థను ఇప్పటికే పాతాళానికి తొక్కేస్తున్నాయి.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇరాన్ పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉన్న ఒబామా కాలం నాటి అణు ఒప్పందాలను పూర్తిగా తుంగలో తొక్కి, ఇరాన్‌ను ఒంటరిని చేయడంలో ఆయన సఫలమయ్యారు. తాజా దాడుల వెనుక ఉన్న వ్యూహం కేవలం సైనికపరమైనదే కాదు, ఇరాన్ పాలకులను మార్చడం కూడా అయి ఉండవచ్చు. మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్న ఇరాన్‌ను పూర్తిగా అణచివేసేందుకు ట్రంప్ తన సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. అగ్రరాజ్యం తన సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శిస్తుంటే, ఇరాన్ నాయకత్వం మౌనంగా ఉండిపోవాల్సి రావడం అక్కడి పాలనా వైఫల్యానికి అద్దం పడుతోంది. జియోపొలిటికల్ పరంగా చూస్తే, ఈ పరిణామాలు కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణ మాత్రమే కాదు. ఇది ప్రపంచ చమురు సరఫరాపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇరాన్ ఒకవేళ ప్రతిఘటనకు దిగితే హార్ముజ్ జలసంధి వంటి కీలక ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరిగి, ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకవచ్చు. అయితే ట్రంప్ మాత్రం ఇరాన్ వద్ద ఇకపై ప్రతిఘటించే శక్తి లేదని బల్లగుద్ది చెబుతున్నారు. ఆ దేశ క్షిపణి వ్యవస్థను ఇప్పటికే నిర్వీర్యం చేశామని, డ్రోన్ల తయారీ కేంద్రాలను ధ్వంసం చేశామని ఆయన పేర్కొనడం ఇరాన్ బలహీనతను బయటపెడుతోంది. నేటి యువతరం ఈ యుద్ధాన్ని డిజిటల్ మాధ్యమాల్లో నిశితంగా గమనిస్తోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు టెహ్రాన్ బీభత్సాన్ని కళ్లకు కడుతున్నాయి. ఒకప్పుడు పర్షియా సామ్రాజ్యంగా వెలిగిన దేశం, ఇప్పుడు నిరంతర దాడులతో శిథిలమవుతుండటం బాధాకరమైన విషయం. కానీ, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ పొరుగు దేశాలను ఇబ్బంది పెడుతున్న ఇరాన్ తీరు వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అంతర్జాతీయ సమాజంలో ఒక వర్గం బలంగా నమ్ముతోంది. అటు నిరసనకారుల గళం, ఇటు బాంబుల శబ్దం మధ్య ఇరాన్ అస్తిత్వ పోరాటం చేస్తోంది. ఏం జరుగుతుందో చూడాలని ట్రంప్ అన్నట్లుగా, ప్రపంచం మొత్తం ఇప్పుడు ఆసక్తిగా గమనిస్తోంది. ముగింపు దశలో ఉన్న ఈ ఘర్షణ ఎటు దారి తీస్తుందో చెప్పలేం కానీ, ఇరాన్ రాజకీయ ముఖచిత్రం మారబోతోందన్నది మాత్రం స్పష్టం. అమెరికా పట్టుదల, ఇజ్రాయెల్ దాడులు, ఇరాన్ అంతర్గత నిరసనలు అన్నీ కలిసి ఆ దేశాన్ని మునుపెన్నడూ లేని సంక్షోభంలోకి నెట్టాయి. లొంగిపోవడమా లేక సర్వనాశనం అవ్వడమా అనే రెండు ప్రత్యామ్నాయాల మధ్య ఇరాన్ నాయకత్వం కొట్టుమిట్టాడుతోంది. ట్రంప్ అన్నట్లుగా ఇది ఒక కొత్త అధ్యాయానికి నాంది కావచ్చని లేదా మరింత రక్తపాతానికి దారితీయవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలమే దీనికి సమాధానం చెప్పాలి.

## మహిళా దినోత్సవ వేడుకల్లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు



**సికింద్రాబాద్, విశాలభారతి:** బౌద్ధ నగర్‌లో అమరావతి ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తో కలిసి బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక చంద్రారెడ్డి పాల్గొన్నారు. స్థానిక మహిళా నాయకులతో సంభాషించి మహిళా సాధికారత, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్రపై చర్చించడం జరిగింది. మహిళల శక్తి, సామర్థ్యం సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే మహత్తర బలం. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఈ సందర్భంగా కార్తీక చంద్రారెడ్డి ఆకాంక్షించారు.

## మత్స్యకారులకు బడ్జెట్లో 5000 కోట్ల కేటాయించాలి



**సికింద్రాబాద్, విశాల భారతి :** మత్స్యకారులకు వచ్చే బడ్జెట్ లో 5 వేల కోట్లు బడ్జెట్ కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేసియో వెంటనే ఇవ్వాలని శుక్రవారం హైదరాబాద్ లోని మినిస్టర్ కోటర్స్ లో మత్స్యశాఖ మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి, ని,మత్స్యశాఖ రాష్ట్ర కార్యాలయంలో మత్స్యశాఖ రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమారల ను పిఎంకెఎం కేవిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తేలు ఇస్తారీ వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

## కల్వకుంట్ల కవితకి జన్మదిన శుభాకాంక్షలు



**సికింద్రాబాద్, విశాలభారతి :** కల్వకుంట్ల కవితకి తెలంగాణ ఉద్యమకారుడు పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు .తెలంగాణ జాగృతి స్థాపించి మహిళలను ఒక్కతాటిపై తెచ్చి బతుకమ్మ పండుగ తెలంగాణ రాష్ట్రంలో ఘనంగా నిర్వహించి కవితమ్మ అంటే బతుకమ్మ అదే విధంగా పేరు సంపాదించిన కల్వకుంట్ల కవితకి జన్మదిన శుభాకాంక్షలు అని , ఇంకా మునుముందు ఎన్నో జరుపుకోవాలని రాష్ట్రంలో మహిళ ముఖ్యమంత్రి వరకు ఎదగాలని మనసారా కోరుకుంటున్న పొట్లకాయల వెంకటేశ్వర్ ముదిరాజ్ ముదిరాజ్ జాతీయ ఎగ్జిక్యూటివ్ నెంబర్ తెలంగాణ ఉద్యమకారుడు నేషనల్ వుమెన్ రైట్స్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు.

## ఘనంగా పాషా భాయ్ జన్మదిన వేడుకలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పెద్ద అంబర్పేట్ డివిజన్ పరిధిలోని పసుమాముల గ్రామం శ్రీనగర్ కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాషా భాయ్ జన్మదిన వేడుకలను గురువారం రాత్రి ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు, పెద్దలు పాల్గొని భాషా భాయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షులు మాట్లాడుతూ.. పాషా భాయ్ స్థానికంగా అబ్దుల్లాపూర్మెట్ మండల పత్రిక ప్రతినిధిగా ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సాధకబాధకాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఇటువంటి సేవాభావం కలిగిన వ్యక్తిగా ఆయనను కాలనీ తరఫున హృదయపూర్వకంగా అభినందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సోమయ్య, వైస్ ప్రెసిడెంట్ చైతన్య, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, కల్చరల్ సెక్రటరీ శ్రీకాంత్ గౌడ్, ట్రెజరర్ అరవింద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రామకృష్ణ, వెంకటరమణతో పాటు కాలనీ పెద్దలు నాగరాజు గౌడ్, అజయ్ గౌడ్, కోటేశ్వర్ రావు, రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు



**రాజేంద్రనగర్, విశాలభారతి:** బండ్లగూడ జాగీరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డిజన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను అర్థం చేసుకొని వారి అభివృద్ధి కోసం కృషి చేస్తూ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న నాయకుడు కృష్ణారెడ్డి అని తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవాభావం కలిగిన నాయకులు సమాజానికి ఎంతో అవసరమని, ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నకృష్ణారెడ్డి సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మంచి ఆరోగ్యం, ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షు పొందుతూ ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని, సమాజానికి ఇంకా గొప్ప సేవలు అందించాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఆకాంక్షించారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**



**విశాలభారతి , గోదావరిఖని:** గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల భద్రత,"మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు",సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి హాజరయ్యారు. ముందుగా గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీస్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీసీపీ మాట్లాడుతూ,మత్తు పదార్థాలకు బానిసలైతే ఎవరి భవిష్యత్తైనా నాశనం అవుతుందని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని,ప్రతి ఒక్కరూ మంచిగా చదువుకుని తమ ప్రాంతానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమలో ఉన్న అపారమైన శక్తిని సరైన దిశలో వినియోగించుకోవాలని తెలిపారు. యువతలో సహజంగా ఉన్న ఉత్సాహం,శక్తిని క్రీడలు,చదువు మరియు సమాజ అభివృద్ధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ వయసులో శారీరకంగా, మానసికంగా ఎక్కువ శక్తి ఉంటుందని,ఆ శక్తిని మత్తు పదార్థాల వైపు మళ్లిస్తే ముందుగా ఆరోగ్యం దెబ్బతింటుందని, తరువాత జీవితమే ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు.మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా దూరం పెట్టాలని, ఎవరికైనా అలాంటి అలవాటు ఉన్నట్లు తెలిసితే ముందుగా వారిని మార్చే ప్రయత్నం చేయాలని, మార్పు రాకపోతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.మత్తు పదార్థాల అక్రమ రవాణా,వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.అలాగే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా యువతలోనే జరుగుతున్నాయని పేర్కొన్నారు.నివేదికల ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో 60 నుంచి 70 శాతం వరకు యువకులే బాధితులవుతున్నారని తెలిపారు.వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,కారును నడిపే సమయంలో సీటుబెల్ట్ ధరించాలని సూచించారు. ఎప్పుడూ రహదారి ఎడమ వైపునే ప్రయాణించాలని, భారీ వాహనాలను దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని హెచ్చరించారు.సైబర్ నేరాల విషయంలో కూడా విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు అడగడం, అనుమానాస్పద లింకులు పంపడం వంటి మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.గతంలో తల్లిదండ్రులు అపరిచితులు ఇచ్చే చాక్లెట్‌లను తీసుకోవద్దని చెప్పేవారని,ఇప్పుడు అదే మోసం మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే లింకులు,మెసేజ్‌ల రూపంలో జరుగుతోందని వివరించారు.

## భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కళ్యాణం

- సకుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి
- వేద పండితుల మంత్రోచ్చరణాల నడుమ ప్రత్యేక పూజలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దంపతులకు సన్మానం



**నిజామాబాద్, విశాలభారతి:** రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి సతీమణి అమ్మమ్మ గారి గ్రామం.. జక్రాన్ పల్లి మండలం సికింద్రాపూర్ లో కొలువు దీరిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో.. భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం శుక్రవారం కన్నుల పండువగా చేపట్టగా.. ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డి సకుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు చేసి.. వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం గర్భగుడిలో రంగనాయక స్వామిని దర్శించుకొని పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలు, పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సమేతంగా అన్నప్రసాదం స్వీకరించారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే ను డప్పు వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి ఆలయ నిర్మాణం విషయమై విన్నవించగా..తప్పకుండా తనవంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షులు చిన్నా రెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు ముసుకు సాయి రెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కౌలాస్ మోహన్,మాజీ ఎంపీపీ మైదం రాజన్న, పార్టీ యువనాయకులు ఉమ్మాజి నరేష్ ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ సర్పంచ్, పెద్దలు,పార్టీ నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసిన జూపల్లి దంపతులు



**అశ్వారావుపేట, విశాలభారతి:** అశ్వారావుపేట మండలంలో జరగబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు అశ్వారావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, వారి సతీమణి మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ అమ్మా దంపతులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా ధైర్యంగా పరీక్షలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని కోరుకున్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి తమ తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మరియు అశ్వారావుపేట మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని, వారు ఉన్నత స్థాయికి ఎదగాలని జూపల్లి దంపతులు ఆకాంక్షించారు. పరీక్షలకు హాజరయ్యే సమయంలో సమయపాలన పాటిస్తూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. అన్ని విద్యార్థులు విజయవంతంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని జూపల్లి దంపతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు మృతిపై సంతాపం

**రాష్ట్ర సిపిఐ పార్టీ నాయకులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు శుక్రవారం ఉదయం పరమపదించారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్ర చారి, ముత్యాల యాది రెడ్డి ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలతో ఘనంగా నివాళులు ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ.. కొండిగారి రాములు మరణం ఎంతో బాధాకరమని తెలిపారు. ప్రజల సేవలో అంకితభావంతో పనిచేసిన ఆయన జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన లేని లోటు తీరనిదని పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ తో పాటు మండలానికి చెందిన సిపిఐ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్**




**మహబూబాబాద్, విశాలభారతి:**

పదవ తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించాలని పిడిఎస్యు మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రభుత్వం మరియు సంబంధిత అధికారుల బాధ్యత అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బానోత్ దేవేందర్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో కీలకమైన మలుపు అని, ఈ పరీక్షల ఫలితాలు వారి భవిష్యత్తును నిర్ణయించే విధంగా ఉంటాయని పేర్కొన్నారు. అందువల్ల పరీక్షలు ప్రశాంతంగా మరియు సౌకర్యవంతంగా జరిగేలా ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటి సదుపాయం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే పరిశుభ్రమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాటిని నిరంతరం శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులు పరీక్షలు రాయడానికి సౌకర్యంగా ఉండేలా సరిపడా బెంచీలు మరియు డెస్కులు ఏర్పాటు చేయాలని, ఎక్కడా కూడా విద్యార్థులు నేలపై కూర్చునే పరిస్థితి రాకుండా చూడాలని అన్నారు. వేసవి కాలం తీవ్రంగా ఉండే పరిస్థితుల్లో ప్రతి పరీక్షా గదిలో ఫ్యాన్లు సక్రమంగా పనిచేసేలా ముందుగానే తనిఖీలు చేసి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. విద్యార్థులు వేడిని తట్టుకోలేక ఇబ్బందులు పడకుండా అన్ని తరగతి గదుల్లో గాలి సరిగా ప్రసరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కీలకమైన దశ కావడంతో ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని బానోత్ దేవేందర్ అన్నారు. విద్యార్థుల సౌకర్యం, భద్రత మరియు పరీక్షల నిర్వహణలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పిడిఎస్యు నాయకులు నవిన్, దినేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ ఏజెన్సీ, రెస్టారెంట్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**నిజామాబాద్, విశాల భారతి :**

గ్యాస్ కొరత నెలకొందనే వదంతుల నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితుల పరిశీలన కోసం స్వయంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని తిలక్ గార్డెన్ ఎదురుగా గల భారత్ గ్యాస్ ఏజెన్సీ అయిన శిల్పా ఎంటర్ ప్రైజెస్ ను, అదే ప్రాంతంలో కొనసాగుతున్న జాఫ్రాన్ హౌజ్ మల్టీ కుషన్ ఫ్యామిలీ రెస్టారెంట్ లను శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా గ్యాస్ ఏజెన్సీని సందర్శించిన కలెక్టర్, ఆన్లైన్ బుకింగ్ వివరాలు పరిశీలించారు. ఎల్.పీ.జీ గ్యాస్ సిలిండర్ల స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎన్ని బుకింగ్ లు అవుతున్నాయి, తదనుగుణంగా సిలిండర్ల పంపిణీ జరుగుతోందా అని ఆరా తీశారు. ఇప్పటికైతే ఎలాంటి కొరత లేదని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అయితే గ్యాస్ కొరత వదంతుల వల్ల బుకింగ్ లు పెద్ద ఎత్తున పెరిగాయని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తూ, సిలిండర్లను పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆన్లైన్ బుకింగ్ లో వినియోగదారులకు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే సంబంధిత కంపెనీల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బందులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1967 కు కాల్ చేయాలని వినియోగదారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ జాఫ్రాన్ హౌజ్ మల్టీ కుషన్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు వండేందుకు వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను పరిశీలించారు. గృహ అవసరాలకు ఉద్దేశించిన డొమెస్టిక్ సిలిండర్లను వాడితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. వినియోగదారులకు పరిశుభ్రమైన ఆహార పదార్థాలను అందించాలని హితవు పలికారు. కలెక్టర్ వెంట ఇంచార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఏఎస్ఓ అరవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.



# మాలకుంట చెరువులో నీటి నిల్వపై వివాదం

- ముదిరాజ్ సంఘం ఫిర్యాదు
- ఘటన స్థలాన్ని పరిశీలించిన హైడ్రా అధికారులు
- చెరువుల సంరక్షణపై ప్రభుత్వ దృష్టి

**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మేట్ :**





రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మేట్ మండలం కుంట్లూరు డివిజన్ పరిధిలోని గౌరెల్లి గ్రామంలో ఉన్న మాలకుంట చెరువులో నీటి నిల్వ లేకుండా కాల్వలు ఏర్పాటు చేశారనే ఆరోపణలపై హైడ్రా అధికారులు స్పందించి ఘటన స్థలాన్ని పరిశీలించారు. గౌరెల్లి గ్రామంలో సుమారు 7.5 ఎకరాల విస్తీర్ణం కలిగిన మాలకుంట చెరువులోకి వర్షాల ద్వారా వచ్చే నీరు నిల్వ కాకుండా కాల్వలు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపిస్తున్నారని గౌరెల్లి గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు ఆరోపించారు. చెరువులో నీరు నిల్వ లేకపోవడం వల్ల చేపల పెంపకం చేయడం కష్టంగా మారిందని



వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ముదిరాజ్ సంఘం సభ్యులు హైడ్రా అధికారులను ఆశ్రయించగా, వారు శుక్రవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకొని చెరువు పరిస్థితిని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు చెరువులోకి వచ్చే నీరు కాల్వల ద్వారా బయటకు వెళ్లేలా ఏర్పాట్లు ఉన్నాయా అనే అంశంపై అధికారులు పరిశీలన చేపట్టారు. గతంలో కూడా ఈ చెరువు కల్వర్టు వ్యవహారంపై నాగోల్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు బాధితులు తెలిపారు. చెరువులో నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ముదిరాజ్ సంఘం సభ్యులు హైడ్రా అధికారులను కోరారు. గౌరెల్లి గ్రామంలో ఉన్న ఈ 7.5 ఎకరాల చెరువును ఆధారంగా చేసుకొని తాము సాగు చేస్తున్నామని, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుండి రైతుబంధు, కిసాన్ యోజన వంటి పథకాల ప్రయోజనాలు కూడా పొందుతున్నామని తెలిపారు. తాము చెరువులో ఎలాంటి అక్రమాలు చేయలేదని స్పష్టం చేశారు. కొంతమంది అపోహలతో ప్రభుత్వ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ఈ చెరువు ప్రాంతంలో కుమ్మరి కులస్తులు తమ సంప్రదాయ వృత్తి అయిన కుండలు తయారు చేస్తూ ఇక్కడే నివసించేవారని కూడా తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా అధికారులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెరువుల సంరక్షణ, అభివృద్ధి మరియు సుందరీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చెరువుల పరిరక్షణ కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతుండగా, చెరువులలో నీటి నిల్వకు ఆటంకం కలిగించే చర్యలను అనుమతించబోమని పేర్కొన్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు వెల్లడించారు. ఘటన స్థలం వద్ద ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నాగోల్ పోలీస్ భారీ బందోబస్తు ను ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ ఉమా, హైడ్రాధికారులు పోలీస్ సిబ్బంది స్థానిక గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫ్రూట్స్ డే సంబరాలు




**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ పట్టణంలో గల త్రివేణి పాఠశాలలో ప్రీ ప్రైమరీ విభాగపు ఫ్రూట్స్ డే సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు తెచ్చిన,సమకూర్చిన ఫలరాజములు ఎంతగానో అబ్బురపరిచాయి. ద్రాక్ష, పుచ్చ,అరటి,సపోటా, నారింజ,బత్తాయి ఇలా ఎన్నో పోషక విలువలు గల పండ్లు వాటి రాజసాన్ని చూపించాయి. ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాల ప్రిన్సిపల్ ఈ. రామ్మూర్తి,కిడ్స్ ఇంచార్జ్ శ్రీమతి జి.కవిత గార్లు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి విద్యార్థులకు ఫలములు తినడం వలన కలిగే ఉపయోగాలను తెలియపరిచారు. అనంతరం విద్యార్థుల విచిత్ర వేషధారణ అందరినీ ఎంతగానో ఆకర్షించింది. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి పాఠశాల డైరెక్టర్ శ్రీ జి.వీరేంద్ర చౌదరి గారు, సి. ఆర్. ఓ. కే.మురళీకృష్ణ గారు విద్యార్థు లకు ప్రత్యేక విషయాలను పంపించగా ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మణుగూరు లగ్జరీ బస్సులు సమయాల్లో మార్పు



**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు నుండి మొదటి సూపర్ లగ్జరీ బస్సులు ఉదయం తెల్లవారుజామున 3.30 నిమిషాలకు రెండవ బస్సు ఉదయం 5.50 నిమిషాలకు 6 గంటల 45 నిమిషాలకు బిహెచ్ఎల్ నాలుగో బస్సు 7.15 నిమిషాలకు ఐదవ బస్సు 8.20 నిమిషాలకు ఆరవ బస్సు 9 గంటల 30 నిమిషాలకు ఏడవ బస్సు 10 గంటల 15 నిమిషాలకు 8వ బస్సు ఉదయం 11 గంటలకు తొమ్మిదవ బస్సు మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాలకు 10వ బస్సు మధ్యాహ్నం 2.15. 3 .30 సాయంత్రం 6.45 రాత్రి 8 గంటలకు వయా పివి కాలనీ. రాత్రి 8.50 లహరి బస్సు రాత్రి 9.45. మరియు 10.45 గంటలకు లాస్ట్ బస్సు అలాగే హైదరాబాదు నుండి మణుగూరుకు బయలుదేరు సమయాలు తెల్లవారు జామున 01.30 . 3.00. 4.00 5.30. ఉదయం 9.55. 10.20. మధ్యాహ్నం 1.20. సాయంత్రం 5.45. 6.45. రాత్రి 8.10 8.45. 9.30 10.15 .10.40 11.50 బస్సులు బయలుదేరుతుంది అని తెలియజేశారు. ఈ సమయానికి ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని తమ గమ్యస్థానాలను చేరుకోవాల్సిందిగా కోరారు.

## ఫేర్వెల్ డే వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, విశాలభారతి:** దమ్మపేట మండలం రంగువారిగూడెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఫేర్వెల్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ఏడవ తరగతి విద్యార్థులు ఇప్పటినుంచి ఇంకాస్త కష్టపడి చదవాలన్నారు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సూచనలు పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే తొ పాటు ఎమ్మార్వో రామ్ నరేష్, స్థానిక సర్పంచ్ దానపు నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జారె



**అశ్వారావుపేట, విశాలభారతి:** ములకలపల్లి మండలంలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.మండలంలోని రాచన్నగూడెం గ్రామంలో సుమారు 26 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించబడనున్న సీసీ రోడ్లు స్వయం సహాయక సంఘాల కోసం కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మూకమామిడి గ్రామపంచాయతీకి నూతనంగా 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని వారి చేతుల మీదుగా ప్రారంభించారు. అదేవిధంగా ములకలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదర సోదరీమణులకు ప్రభుత్వం అందజేస్తున్న రంజాన్ కానుకలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాలలో మండల అధ్యక్షులు తాండ్ర ప్రభాకర్ రావు , యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పాలకుర్తి సుమిత్ , కారం సుధీర్ , సర్పంచులు మడకం విజయ, కల్లూరి కిషోర్ , కోర్స ఆదిలక్ష్మి , ఎమ్మార్వో భాగ్యలక్ష్మి , ఎంపీడీవో రామారావు , ఎంపీఓ రమేష్ బాబు , ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్ , పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్ , కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నిరసన



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్ర నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తంగా కొనసాగుతోంది. స్టయిఫండ్ పెంపు డిమాండ్‌తో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఆందోళనలో భాగంగా ముగ్గురు విద్యార్థులు భవనం పైకెక్కి కిందకు దిగకుండా నిరసన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విశ్వవిద్యాలయం పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. పోలీసులు మరియు విద్యార్థుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యార్థులతో పోలీసులు దురుసుగా ప్రవర్తించారని, తోసివేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొందరు విద్యార్థులను హాస్టల్ గదుల్లోనే ఆపివేసి హెచ్చరికలు జారీ చేస్తున్నారని కూడా విద్యార్థులు ఆరోపిస్తున్నారు. స్టయిఫండ్ పెంపు వంటి న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం అమలు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి వచ్చి హామీ ఇచ్చేంతవరకు తమ ఆందోళనను విరమించే ప్రసక్తే లేదని విద్యార్థులు స్పష్టం చేశారు. ముగ్గురు విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

## చెన్నారెడ్డి ఎంక్లేవ్‌కు నూతన రోడ్డు

**విశాలభారతి:** గ్రేటర్ మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెన్నారెడ్డి ఎంక్లేవ్ ప్రధాన రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో, రోడ్డు పునర్నిర్మాణం చేయవలసిందిగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను, మాజీ మేయర్ అమర్ సింగ్ ని, స్థానిక బిల్డర్ శ యాదవ రెడ్డిని హరిహర గ్రూప్ గేటెడ్ కమ్యూనిటీల మేనేజింగ్ కమిటీ సభ్యులు కోరారు. ఇందుకు స్పందించిన యాదవ రెడ్డి కాలనీ వాసుల భద్రత దృష్ట్యా నూతన తారు మిశ్రమంతో రోడ్డు నిర్మాణం చేపట్టి శుక్రవారం నాడు రోడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ , పలువురు నాయకులు, కాలనీ వాసులు యాదవ రెడ్డిని అభినందించారు. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ, కాలనీలో పెండింగ్‌లో ఉన్న సెంట్రల్ లైటింగ్ డివైడర్ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను, మాజీ మేయర్ అమర్ సింగ్ ని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి విరాధ్య సెక్రటరీ సైదులు గౌడ్, చైర్మన్ సంజీవ్, ట్రెజరర్ సతీష్, శ్రీ సాయి ఆనందమయి ప్రెసిడెంట్ డాక్టర్ అశోక్, సెక్రటరీ చేతన, శ్రీ సాయి సౌఖ్య సెక్రటరీ నాగరాజు మరియు హరిహర గ్రూప్ గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు భూపాల్ రెడ్డి, ప్రేమ్ కుమార్, తిరుమలేష్, రమేష్ రెడ్డి, వేణు రెడ్డి, మురళీధర్, సరోత్తమ్, ప్రసాద్,సత్యనారాయణ,చంద్రశేఖర్, మధు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రులారా మీ పిల్లల భవిష్యత్ మా బాధ్యత

- 2026-27 అడ్మిషన్లు జరుగుతున్నవి
- ప్రతి ఒక్క విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ ప్రిన్సిపల్ సిస్టర్ సుమలత
- మీ నిర్ణయం మంచిదె స్టెల్లా మేరీ స్కూల్ అడ్మిషన్ తీసుకోండి

**బూర్గంపాడు, విశాలభారతి:**




తల్లిదండ్రులారా ఒక్కసారి ఆలోచించండి క్రమశిక్షణతో కూడిన విద్య పొందడం మన హక్కు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు స్టెల్లా మేరీ స్కూల్ మొరంపల్లి బంజర పునాది కానుంది . నిత్యం మనం చూస్తూనే ఉన్నాం. దూర ప్రాంత పట్టణాల ప్రయాణాలతో పిల్లలు చదువుపై ఏకాగ్రత కోల్పోవడం, దూర ప్రాంతాల పాఠశాలలపై తల్లిదండ్రుల మక్కువ చూపడం , డ్రైవర్ల నిర్లక్ష్యం, మితిమీరిన వేగాం వెంబడి ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. కావున స్టెల్లా మేరీ స్కూల్ మొరంపల్లి బంజర పరిసర ప్రాంత గ్రామ తల్లిదండ్రులారా దూర చదువులంటూ పెద్దపెద్ద కార్పొరేట్ పాఠశాలలకు వేలకు వేల ఫీజులు కట్టి అభం శుభం తెలియని పసికందులను ప్రమాదాలకు గురిచేస్తున్నారు . ఈ ఏడాది 2026 2027 అడ్మిషన్ మన స్టెల్లా మేరీ స్కూల్ మొరంపల్లి బంజర్ లో అడ్మిషన్ తీసుకొని మీ పిల్లలపై దూర ప్రయాణాల భారం తగ్గించి, ప్రమాదాల బారిన పడకుండా తప్పించే బాధ్యత మీదే.అతి తక్కువ ఫీజులకె కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం. కావున మొరంపల్లి బంజర పరిసర గ్రామ తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని మనవి. అత్యంత నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు, డ్రైవర్లచె మా స్కూల్ విద్యారంగంలో దశబ్ద కాలం పాటు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ విద్యను అందించడంలో కార్పొరేట్ స్కూళ్ల కంటే ముందంజలో ఉన్నందుకు గర్వపడుతున్నాం. కావున దూర విద్య వద్దు, స్టెల్లా మేరి స్కూల్ విద్య ముద్దు.మీ ప్రిన్సిపల్ సుమలత ( స్టెల్లా మెరిస్కూల్ మొరంపల్లి బంజర, మరిన్ని వివరాలకు ఆఫీస్ నంబర్‌ను సంప్రదించగలరు.)

## అత్తపూర్‌లో 3 హోటళ్ల యజమానులపై కేసులు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** అత్తపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫుడ్ అడల్టరేషన్‌కు సంబంధించి మూడు కేసులు నమోదు అయ్యాయి. అత్తపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ ఫిర్యాదు మేరకు పోలీసులు చర్యలు చేపట్టారు. మొదటి ఘటనలో పిలర్ నంబర్ 127 వద్ద ఉన్న మొఘల్ బావర్చి హోటల్లో అనారోగ్యకరమైన మరియు పాత ఆహార పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. చికెన్ గ్రేవీ, అన్నం, చికెన్, మటన్ మరియు కట్ చేసిన కూరగాయలను ప్లాస్టిక్ బకెట్లలో, స్టీల్ పాత్రల్లో డీప్ ఫ్రీజర్‌లో అస్వచ్ఛమైన పరిస్థితుల్లో నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. కొన్ని ఆహార పదార్థాలు ఫంగస్ పట్టి పాడైపోయినట్లు వెల్లడైంది. ఈ కేసులో హోటల్ యజమాని సయ్యద్ కలీమ్‌పై కేసు నమోదు చేశారు. రెండవ ఘటనలో ఎన్ఎం గూడాలో ఉన్న బాలాజీ ధాబా టైటానియం రెస్టారెంట్‌లో కూడా పాడైన కూరగాయలు నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. క్యారెట్ , బీన్స్, కాలిఫ్లవర్, గార్లిక్, మష్రూమ్ వంటి పదార్థాలను అస్వచ్ఛమైన పరిస్థితుల్లో డీప్ ఫ్రీజర్‌లో నిల్వ ఉంచినట్లు తేలింది. ఈ కేసులో హోటల్ యజమాని అశోక్ సైనిపై కేసు నమోదు చేశారు. మూడవ ఘటనలో ఎంఎం పహాడీ క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న షాహీ కల్యాణి బిర్యానీ హోటల్‌లో చికెన్ 65 మసాలా, బీఫ్, పుదీనా చట్నీ, మైదా పిండిని ప్లాస్టిక్ బకెట్లలో అస్వచ్ఛమైన పరిస్థితుల్లో నిల్వ ఉంచినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో హోటల్ యజమాని మొహమ్మద్ తాహేర్ ఖురేషీపై కేసు నమోదు చేశారు. ఈ మూడు ఘటనల్లో కూడా హోటళ్లలో ఎలుకలు, పిల్లులు సంచరిస్తున్నట్లు గుర్తించడంతో ఆహారం వినియోగించే కస్టమర్ల ఆరోగ్యానికి ప్రమాదం కలిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే విధంగా పాత మరియు అస్వచ్ఛమైన ఆహారం విక్రయించినందుకు హోటల్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అత్తపూర్ పోలీసులు వెల్లడించారు.

## నీటి సమస్యపై భగ్గుమన్న స్థానికులు

**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హిమాయత్ సాగర్ ఎస్సీ బస్తీలో శుక్రవారం ఉదయం కలుషిత నీరు సరఫరా కావడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా తాగునీటిలో మురికి, రంగు మారిన నీరు వస్తోందని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పరిస్థితి మరింత తీవ్రంగా మారడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో ఫిల్టర్ బెడ్ ప్రాంతానికి చేరుకుని జలమండలి అధికారులను నిలదీశారు. తమ సమస్యను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తూ అధికారులపై మండిపడ్డారు. ప్రజలు మాట్లాడుతూ, కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, కలుషిత నీరు తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాగునీటి విషయంలో అధికారులు నిర్లక్ష్యం చూపడం తగదని, వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై స్పందించిన జలమండలి హిమాయత్ సాగర్ డీజీఎం గోవింద్ గౌడ్ మాట్లాడుతూ, గురువారం నీటి ట్యాంకును శుభ్రం చేయడం వల్ల నీటి రంగు మారి ఉండవచ్చని తెలిపారు. అదేవిధంగా సమీప ప్రాంతాల్లో ఎక్కడైనా పైపులైన్ లీకేజీ జరిగి ఉండే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. సమస్యపై తమ సిబ్బందితో వెంటనే తనిఖీలు చేయించి తక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అధికారుల హామీతో స్థానికులు తాత్కాలికంగా శాంతించినప్పటికీ, సమస్యను త్వరగా పరిష్కరించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రజలు మరోసారి అధికారులను కోరారు.



## గెలుపు మార్పుకు నాంధి పలకాలి

- సమాజ వికాసం కోసం ప్రజా ప్రతినిధులు పనిచేయాలి
- సీపీఐ రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో ప్రొ. కోదండరామ్

**భద్రాద్రి ప్రతినిధి:విశాలభారతి:**



ప్రజాస్వామిక పద్ధతుల్లో సాధించిన గెలుపు సమాజ మార్పుకు నాంధి వలకాలని ప్రొ. కోదండరామ్ అన్నారు. రాజ్యాంగానికి లోబడి జవాబుదారీ పాలనను అందిస్తూ ప్రజల హక్కులను రక్షించడంతో పాటు పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన గెలుపొందిన కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉపసర్పంచుల రెండు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం పాల్వంచ సుగుణా గార్డెన్స్లో స్థానిక శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించగా, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ గణేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన శిక్షణా తరగతుల్లో కోదండ రామ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ముఖ్యంగా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు రాజకీయ దృక్పదంతో పాటు ప్రత్యేక లక్ష్యం ఉండాలని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పనితీరు ఉద్యమాన్ని నిలబెట్టాలని సూచించారు. ఒకప్పుడు ప్రజాప్రభుత్వాలు ఉండేవి కావని, దేవుని అనుగ్రహం ఉన్న వారు మాత్రమే పాలకులు అవుతారని నమ్మేవారని, కానీ రానురానూ వచ్చిన మార్పుతో దేవునితో సంబంధం లేని మానవతా వాదంతో ఒక వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అటువంటి రాజకీయాలను ప్రోత్సహించాలన్నారు. నిధులు, విధుల కు చైతన్యం తోడైతేని సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయన్నారు.

**రాజకీయాలే సమస్యగా మారాయి-ప్రొ. హరగోపాల్:**

రాజకీయమంటే సమాజ సమస్యలను అర్థం చేసుకుని వరిష్కరించడమని, కానీ ఇప్పుడు రాజకీయమే ఒక సమస్యగా మారిందని ప్రొ. హరగోపాల్ తెలిపారు. సిపిఐ ప్రజా ప్రతినిధుల శిక్షణా తరగతుల్లో హర గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరగడం నైతికత లోపించడం తదితర కారణాలతో రాజకీయాలు కలుషితమయ్యాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో అధికారం అంటే సమాజం నుంచి పొందడం అని, అలాంటి అధికారాన్ని సమాజాభివృద్ధికి, ప్రజల జీవన విధానంలో మార్పుకు దోహదపడేలా కృషి జరగాలన్నారు.చైతన్యం ద్వారా మార్పు వస్తుందని, మార్క్స్ చెప్పినట్లుగా సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని ఆయన తెలిపారు.బల ప్రయోగం రాజ్యాంగ లక్షణం అని తెలిపారు. ఈ సమాజం తల్లితండ్రి శిక్షించ లేక పోయినా రాజ్యాంగానికి శిక్షించే అధికారం ఇచ్చిందని ఆయన తెలిపారు. సమాజ మార్పు చైతన్యవంతమైన మనిషితో సక్రమ మార్గంలో జరుగుతుందని హర గోపాల్ తెలిపారు.

## గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ గుర్తింపు రద్దు చేయాలి

**మొయినాబాద్, విశాలభారతి:**




విద్యార్థులపై దాడికి పాల్పడిన గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు ఎర్రవల్లి శ్రీనివాస్, కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న విద్యార్థుల నుంచి కన్సాలిడేషన్ ఫీజు పేరుతో అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జేఎన్‌టీయూకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో కళాశాల యాజమాన్యం విద్యార్థులపై కక్ష సాధించిందని అన్నారు. ఫిర్యాదు చేసిన విద్యార్థులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ అహ్మద్ జీషన్, ప్యూన్ మల్లేష్ కలిసి గదిలో బంధించి దాదాపు రెండు గంటల పాటు వేధింపులకు గురి చేశారని తెలిపారు. సిఎస్ఈ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మహమ్మద్ సాదిక్, వి. కృతిక్ రెడ్డి, హైమత్ అబ్రార్, నితీష్ కుమార్, సంతోష్ మరియు సిఎస్‌డీ మూడో సంవత్సరం విద్యార్థులు ఉదయ్, హాజరత్‌లపై ఇతర అధ్యాపకుల సమక్షంలో దాడి చేశారని ఆరోపించారు. జేఎన్‌టీయూ మరియు గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ కలిసి విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని కూడా విమర్శించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గ్లోబల్ ఇంజనీరింగ్ కాలేజ్ గుర్తింపును రద్దు చేయాలని, విద్యార్థులపై దాడి చేసిన కళాశాల అధ్యాపకులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు అల్లి దేవేందర్, ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, మండల అధ్యక్షుడు రేశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



# అదే నిజమైతే టైమ్ మొదలైనట్టే

పన్నెండేళ్ల క్రితం 'ఊహలు గుసగుసలాడే' అనే హిట్ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగు పెట్టింది ఢిల్లీ భామ రాశీఖన్నా. ఆ తర్వాత ఎన్టీఆర్, రవితేజ, ధనుష్ వంటి స్టార్లతో సినిమాలు చేసినా, అనుకున్నంత స్టార్‌డమ్ మాత్రం రాశీఖన్నాను వరించలేదు. నిజానికి అందంలోనూ, అభినయ సామర్థ్యంలోనూ నేటి స్టార్ హీరోయిన్లెవరికీ తీసిపోదు రాశీఖన్నా. కానీ ఇండస్ట్రీలో ఎదగాలంటే గుమ్మడికాయంత విద్వత్తుంటే చాలదు, ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలి. ఆ అదృష్టం కోసం దశాబ్దానికి పైగా ఎదురుచూస్తూనే ఉంది ఈ అందాలభామ. ఈ నెల 19న రానున్న పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' తన కెరీర్‌కి గేమ్‌ఛేంజర్ అని ఆమె గట్టిగా నమ్ముతోంది. ఇదిలావుంటే, ఈ క్రేజీ సినిమా తర్వాత, వెంటనే మరో పానిండియా సినిమాలో రాశీఖన్నా భాగం కానున్నట్టు తెలిసింది. అల్లు అర్జున్ హీరోగా తమిళ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ ఓ భారీ పాన్ ఇండియా మూవీకి శ్రీకారం చుడుతున్న విషయం తెలిసిందే. మైత్రీ మూవీమేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ మూవీలో కీలక పాత్ర కోసం రాశీఖన్నాను దర్శకుడు లోకేష్ కనకరాజ్ సంప్రదించారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని తెలిసింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.